ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

మంగళవారం 26 నవంబరు 2024



యనమలకుదురు శివాలయానికి పోటెత్తిన భక్తులు



• శివోహం

కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున. పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శివ నామస్మరణతో శైవక్షేత్రాలు మర్మోగాయి.



• కోలాటం ఆడిన కబీర్ బేడి

ప్రముఖ బాలీవుడ్ నటుడు కబీర్ బేడి గుడ్లవల్లేరులో సోమవారం సందడి చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన కేర్ టు యాక్ట్ ఇటలీ సంస్థ ప్రతినిధులు, గ్రామ మహిళలతో కలిసి కోలాటం ఆడి గ్రామస్థులను అలరించారు.

6లో

గడువులోగా పరిష్కరించాల్సిందే



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ

6లో

వైసీపీ హయాంలో బూతులతో రెచ్చిపోయిన కొడాలి నాని అక్రమాల పుట్ట బద్దలయ్యే రోజులు దగ్గర పడ్డాయి. అధికారం అండతో అడ్డగోలుగా చేసిన అక్రమాలు ఆయన మెడకు చుట్టుకోనున్నాయి. జగనన్న కాలనీల మెరక పేరుతో భారీ దోపిడీకి తెరదీసిన నాని అక్రమాలపై గత కొన్ని రోజులుగా దృష్టిసారించిన విజిలెన్స్ అధికారులు పూర్తి సాక్ష్యాధారాలతో అన్ని రకాల స్టేట్‌మెంట్లను రికార్డు చేసి కొడాలి నానికి ఉచ్చు బిగించేందుకు సిద్ధం అవుతున్నారు. - (విజయవాడ - ఆంధ్రజ్యోతి)



జగనన్న కాలనీ

కొడాలి మెడకు మెరక ఉచ్చు

జగనన్న కాలనీ మెరక దోపిడీపై విజిలెన్స్ నివేదిక

అధికారం అండతో అడ్డగోలు దోపిడీ

పేదల సొంత ఇంటి కలను ఆసరాగా చేసుకుని వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు అన్నీఇన్నీ కావు. వైసీపీ హయాంలో గుడివాడ నియోజకవర్గంలో జగనన్న కాలనీలకు మల్లాయపాలెంలో 173.8 ఎకరాలు సేకరించారు. ఎకరా రూ.52 లక్షలు పెట్టి కొనుగోలు చేశారు. ఇంత ఖర్చు పెట్టినా అదంతా లోతట్టు ప్రాంతం. దీంతో దీన్ని మెరక చేయాలన్న నెపంతో కొడాలి నాని అక్రమాలకు తెరదీశారు. గ్రావెల్‌తో మెరక చేయాల్సి ఉండగా స్థానికంగా ఉన్న చెరువుల్లో మట్టిని, సాగునీటి కాల్వలు, డ్రెయిన్లలో మట్టిని తవ్వి మెరకకు ఉపయోగించారు. బిల్లులు మాత్రం ఎక్కడో దూరం నుంచి గ్రావెల్ తరలించినట్లు చూపి కోట్లు కొల్లగొట్టారు. ఈ అవినీతి ఫలితం మల్లాయపాలెంలో సుమారు 7వేల మందికి సెంటు పట్టాలు ఇస్తే అందులో ప్రస్తుతం వంద మంది కూడా నివాసం ఉండలేని పరిస్థితి. చిన్నపాటి వర్షానికే ఈ ప్రాంతం జలమయమై పోతుంది. ప్రజలకు కష్టాలు మిగిల్చిన నాని మాత్రం మల్లాయపాలెం జగనన్న కాలనీ పేరుతో కోట్లాది రూపాయలు ఆర్జించారు.



జగనన్న కాలనీ

రూ.40 కోట్లు స్వాహా అయినట్టు ప్రాథమిక నిర్ధారణ

- జగనన్న కాలనీకి 173.8 ఎకరాలు సేకరణ.. అంతా లోతట్టే
- దాని మెరక పేరుతో అనుచరులకు వర్క్ ఆర్డర్లు
- చేసింది రూ.8 కోట్ల పని.. మింగింది రూ.40 కోట్లు
- అనుచరుల ఖాతాల్లో డబ్బులు పడిన వెంటనే బినామీ ఖాతాల్లోకి మళ్లింపు
- త్వరలో ప్రభుత్వానికి చేరనున్న నివేదిక.. ఆపై రంగంలోకి ఏసీబీ

అధికారులనూ ఇరికించేశారు..

మల్లాయపాలెం జగనన్న కాలనీ మెరక చేసేందుకు గ్రామ పంచాయతీలో సంబంధిత అధికారులతో 2020 ఏప్రిల్ 25న అత్యవసర సమావేశం ఏర్పాటు చేయించారు. అప్పుడున్న ఎంపీడీవో కుమారి వెంకట రమణ సాయంతో చేతిరాతతో వర్క్ ఆర్డర్స్ రాయించి తన అనుచరులు 16 మందికి మెరక పనులు కట్టబెట్టారు. ఇలాంటి వర్క్ ఆర్డర్లు పది వరకు ఇచ్చారు. సుమారు రూ.150 కోట్లు విలువైన వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. వర్క్ ఆర్డర్లు పొందిన వారంతా కొడాలి నాని అనుచరగణానికి తెలిసిన సాదాసీదా వ్యక్తులు. వారి ఖాతాల్లోకి జమ అయిన సొమ్ములు తిరిగి కొడాలి నాని బినామీ ఖాతాల్లోకి చేరిపోయాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని నాని అనుచరులు... దుక్కిపాటి శశిభూషణ్, పాలడుగు రాంప్రసాద్, కసుకుర్తి బాబ్జీ(గేదెల బాబ్జీ), కొల్లి విజయ్, తదితరులు నడిపించారు. అప్పటి అధికారులూ అడ్డగోలుగా సహకరించారు. పంచాయతీ సెక్రటరీ మొదలు ఎంపీడీవో, నాటి డ్వామా పీడీ ఇలా అధికారులందరి మెడకూ అవినీతి ఉచ్చు బిగియనుంది.

పక్కా ఆధారాలతో నివేదిక సిద్ధం

విజిలెన్స్ అధికారులు గత కొన్ని నెలలుగా కొడాలి నాని అక్రమాలను వెలికి తీసేందుకు అన్ని రికార్డులను జల్లెడపడుతున్నారు. పక్కా ఆధారాలను సేకరించి నివేదిక సిద్ధం చేశారు. ప్రాథమికంగా సుమారు రూ.40 కోట్ల మేర నిధులు కొడాలి నాని బినామీ ఖాతాలకు బదిలీ అయినట్లు నిర్ధారించారు. ఇంత మొత్తంలో నిధులు బదిలీ అయినా క్షేత్రస్థాయిలో కేవలం రూ.8 కోట్ల విలువైన పని కూడా జరగలేదని విజిలెన్స్ అధికారుల నివేదిక స్పష్టం చేస్తోంది.

● మల్లాయపాలెం గ్రామ పంచాయతీ 2020 ఏప్రిల్ 25న నిర్వహించిన అత్యవసర సమావేశంలో మెరక తోలకానికి 16 మందికి వర్క్ ఆర్డర్లు ఇచ్చింది. వారిలో మందా ఛటర్జీ ఒకరు. ఈయనకు 0608542090107031 నంబరుతో వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ఆయన పని పూర్తి చేసినట్లు నిర్ధారించిన డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ 2022 జూలై 21న ఆయన ఖాతాలోకి రూ.1, 12, 25,642 నిధులు జమ చేశారు. ఈ నిధులు నాలుగు రోజులు తిరగక ముందే కొడాలి నాని బినామీ ఖాతాల్లోకి వెళ్లిపోయాయి. 2022 జూలై 28న నాని బినామీ కంపెనీ శ్రీనివాస గార్మెంట్స్‌కి రూ.50 లక్షలు చొప్పున రెండు విడతల్లో కోటి రూపాయలు చెక్ ద్వారా బదిలీ అయ్యాయి. 2022 ఆగస్టు 2న రూ.4లక్షలు శ్రీ సాయిరామ్ ఎంటర్‌ప్రైజెస్‌కు బదిలీ అయ్యాయి. 2022 ఆగస్టు 3న మరో వ్యక్తి ఖాతాలోకి రూ.7 లక్షలు బదిలీ అయ్యాయి.

● మందా ఛటర్జీ ఖాతాలోకి రెండోసారి 2022 ఆగస్టు 5న ప్రాజెక్టు డైరెక్టర్ డ్వామా నుంచి రూ.48,51,788 జమ అయ్యాయి. మరుసటి రోజే అంటే ఆగస్టు 6న ఈ నిధులు ఎమ్మెల్యేకి అత్యంత సన్నిహితులు ఈ మట్టి మాయాజాలానికి సూత్రధారుడైన సజ్జ శ్రీధర్ ఖాతాలో రూ.14,70,047 జమ అయ్యాయి. అదే రోజు కొల్లి విజయ్

మిగతా 6లో..

అన్నదాత ఉరుకులు పరుగులు

జిల్లాలో వరికోతలు ముమ్మరమైన వేళ వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో అన్నదాతలు వరి పంటను కాపాడుకునేందుకు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికలతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. యంత్రాల ద్వారా వరికోతలు పూర్తి చేస్తే ధాన్యం కొనుగోలు చేయమని మిల్లర్లు బీష్మించారు. రైతులు ధాన్యం విక్రయించేందుకు సంచులు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో తాము పండించిన ధాన్యాన్ని ఎక్కడ భద్రపరుచుకోవాలో తెలియక రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

రానున్న మూడురోజులు భారీవర్షాలని వాతావరణశాఖ హెచ్చరిక



బస్తాల్లోకి ఎత్తుతున్న ధాన్యం

- ధాన్యం కొనబోమంటున్న మిల్లర్లు.. గన్నీ బ్యాగులు ఇవ్వని వైనం
- ధాన్యం రవాణాకు అందుబాటులో లేని వాహనాలు
- అసలు రైతులు వేలిముద్రలు వేయాలని నిబంధనలు
- ధాన్యం ధరలోనూ మిల్లర్ల కోత

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నంఖ/గుడ్లవల్లేరు : తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తేనే కొనుగోలు చేస్తామని కొందరు మిల్లర్లు షరతులు పెడుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఇబ్బందులు పడకుండా అన్నిచర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ జేసీ గీతాంజలిశర్మకు, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరుకు సోమవారం సూచించారు.

సంచులు ఇవ్వకుండా.. వాహనాలు సమకూర్చకుండా..

జిల్లాలో వరి కోతలు వారం నుంచి ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 50వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనాగా ఉంది. రానున్న మూడు రోజులపాటు బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా కోస్తాతీరం వెంబడి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సోమవారం హెచ్చరికలు జారీచేసింది. సోమవారం ఆకాశం మేఘావృతమై వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు యంత్రాల ద్వారా వరికోతలు పూర్తిచేస్తున్నారు. కంకిపాడు మండలంలో సోమవారం 150 వరికోత యంత్రాలు కోత కోసే పనిలో ఉన్నాయి. కోత కోసిన ధాన్యం రహదారులపైకి చేర్చి ఆరబెట్టడం, లేదా రాశులుగా పోసే పనుల్లో రైతులున్నారు. ధాన్యం విక్రయించేందుకు రైతు సేవా కేంద్రాలకు రైతులు వెళితే గోనెసంచులు అందుబాటులో లేవని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికే సంచుల్లోకి ఎత్తిన ధాన్యంను మిల్లులకు చేర్చాలని రైతులు కోరితే ధాన్యం రవాణాకు వాహనాలు అందుబాటులో ఉంచడంలేదు. కంకిపాడు, ఉయ్యూరు, పామర్రు గన్నవరం, పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి తదితర ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. వాహనాలు సమకూర్చాలని రైతులు అడిగితే మిల్లుల వద్ద ధాన్యం సకాలంలో దిగుమతి కావడంలేదని, వెయిటింగ్ చార్జీలు రోజుకు రూ.1500లను రైతులే పెట్టుకుంటే వాహనాలు సమకూరుస్తామని షరతులు పెడుతున్నారు. తేమశాతం అధికంగా ఉన్న ధాన్యంను డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులకు తరలించాలంటే 40కిలోమీటర్ల వరకు రవాణాచార్జీలు ప్రభుత్వం ఇస్తుందని, అంతకుమించి దూరం పెరిగితే రైతులే రవాణాచార్జీలు భరించాలనే షరతులు పెట్టారు. డ్రయ్యర్ సౌకర్యం ఉన్న మిల్లులలో ధాన్యం పరిమితికి మించి ఇప్పటికే దిగుమతి చేసుకున్నారు. యంత్రాల ద్వారా కోసిన ధాన్యం కొనుగోలు చేయమని మిల్లర్లు తెగేసి చెబుతున్నారు. మిల్లర్ల వద్ద గోనె సంచులు అందుబాటులో ఉన్నా, రైతులకు ఇవ్వకుండా, ధాన్యం రవాణాకు వాహనాలు పంపకుండా పనిగట్టుకుని జాప్యం చేస్తున్నారు. ఒకవైపు రానున్న మూడు రోజులపాటు భారీవర్షం కురుస్తుందనే భయంతో రైతులు వరికోతలను వేగవంతం చేస్తుండగా, సంచులు, వాహనాలు అందుబాటులో లేకపోవడంతో రాశులుగా పోసిన ధాన్యం ఎలా కాపాడుకోవాలనే అంశంపై రైతులు ఆందోళనలో ఉన్నారు. కంకిపాడు తదితర ప్రాంతాల్లో రహదారులపై ఎక్కడ చూసినా ధాన్యం రాశులు కనిపిస్తున్నాయి. 1262, 1318 వంటి రకాల ధాన్యం ఇప్పటికిపుడు కొనుగోలు చేయమని మిల్లర్లు చెబుతున్నారు. దీంతో ఈ రకం ధాన్యం ఎన్ని రోజులపాటు నిల్వ ఉంచాలనే భయం రైతులను వెంటాడుతోంది. సోమవారం ఉదయం వరకు బస్తా ధాన్యం రూ.1450కు కొనుగోలు చేయగా, మధ్యాహ్నం నుంచి 1400లకు ధరను తగ్గించి వేశారు.

రైతులు వేలిముద్రలు వేయాలని షరతులు

రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటే భూమిపత్రాలు ఎవరిపేరున ఉంటే, వారు స్వయంగా రైతుసేవాకేంద్రాలకు వచ్చి వేలిముద్రలు వేయాలనే నిబంధన పెట్టారు. జిల్లాలో 1.65 లక్షల మంది కౌలురైతులే ఉన్నారు. కౌలురైతుల వేలిముద్రలు చెల్లుబాటు కావని రైతు సేవాకేంద్రాల్లో పనిచేసే సాంకేతిక సిబ్బంది చెబుతుండటంతో ధాన్యం విక్రయాల్లో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇతర జిల్లాల్లో, రాష్ట్రాల్లో, విదేశాల్లో ఉన్న భూమి యజమానులు ధాన్యం విక్రయం కోసం ఇక్కడకు వచ్చి వేలిముద్రలు వేస్తారని కౌలురైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విధానాన్ని పూర్తిగా ఎత్తివేయాలని కౌలు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మార్కెట్ యార్డుల్లో ధాన్యం నిల్వకు ఏర్పాట్లు

సృజన, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజరు

కోస్తా తీరం వెంబడి రానున్న మూడు రోజుల పాటు వర్షం కురుస్తుందనే హెచ్చరికలతో మార్కెట్ యార్డులలోని గూడౌన్‌లలో ధాన్యం భద్రపరచుకునేలా చర్యలు తీసుకున్నాం. పామర్రు, ఉయ్యూరు, మొవ్వ, ఘంటసాల మండలాల్లోని వ్యవసాయ మార్కెట్ యార్డులలోని ధాన్యం భద్రపరచుకోవాలని రైతులకు ఇప్పటికే చెప్పడం జరిగింది. వాతావరణం అనుకూలంగా మారిన తర్వాత ధాన్యం ఆరబెట్టుకుని విక్రయించుకోవచ్చు. రాశులరూపంలో ఉన్న ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లను రైతులకు అందుబాటులో ఉంచాం. 1262, ఇతర రకాలధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం, రైతులకు గోనెసంచులు ఇవ్వని మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని జేసీ గీతాంజలిశర్మ ఇప్పటికే హెచ్చరించారు.

గుడివాడ మున్సిపాల్టీలో అధికారుల నిర్లక్ష్యం మరోమారు బయటపడింది. పాత కమిషనర్ వద్ద ఉండాల్సిన డిజిటల్ కీ కమిషనర్ సీసీ వద్ద ఉండటం వివాదానికి దారితీసింది. ప్రస్తుత కమిషనర్ హయాంలో పాత కమిషనర్ పేరున సర్టిఫికేట్‌లు జారీ అవ్వడం, వాటిని పాత కమిషనర్ గుర్తించి ఆరా తీయడంతో డొంక కదిలింది. దీంతో పాత కమిషనర్, మున్సిపల్ అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. గతంలో మ్యుటేషన్ స్కాంలో కూడా ఇదే తరహాలో కమిషనర్ల డిజిటల్ సంతకాలను వాడి కోట్లాది రూపాయల మున్సిపల్ నిధులను కొందరు మున్సిపల్ అధికారులు కొల్లగొట్టిన విషయం తెలిసిందే.



గుడివాడ పురపాలక సంఘం

జనన, మరణ ధ్రువ పత్రాల జారీలో

అక్రమాలు

గుడివాడ మున్సిపాల్టీలో బయటపడిన మరో బాగోతం

- సీసీ చేతికి పూర్వ కమిషనర్ డిజిటల్ కీ
- ప్రస్తుత కమిషనర్‌కు తెలియకుండా ఇష్టారాజ్యంగా సర్టిఫికెట్ల జారీ
- టెక్నికల్ సమస్య అంటూ బుకాయిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది
- గతంలో మ్యుటేషన్ స్కాం కూడా ఇదే తరహాలో ..
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

ఆంధ్రజ్యోతి-గుడివాడ : గుడివాడ మున్సిపాల్టీ పరిధిలో జనన, మరణ, వివాహ రిజిస్ట్రార్‌గా మున్సిపల్ కమిషనర్ వ్యవహరిస్తారు. మున్సిపాల్టీలో బిల్లులు ఈ-ఆఫీస్ నిర్వహణకు ఒక డిజిటల్ కీ, జనన, మరణ, వివాహ రిజిస్ట్రార్‌గా, ఆన్‌లైన్ టెండర్‌ల ప్రక్రియలో ప్రత్యేకంగా డిజిటల్ కీ ఉంటుంది. పాత కమిషనర్‌గా వ్యవహరించిన బాలసుబ్రహ్మణ్యం ప్రస్తుతం గుడివాడ ఆర్డీవోగా వ్యవహరిస్తున్నారు. అదే విధంగా మున్సిపల్ ప్రత్యేక అధికారి కూడా ఆయనే కావడం విశేషం. పాత కమిషనర్ రిలీవ్ అయ్యాక ఆయనకు చెందిన డిజిటల్ కీ కమిషనర్ సీసీ వద్దనే వదిలేశారు. బాధ్యతగా డిజిటల్ కీని నిలుపుదల చేసుకోవలసిన బాధ్యత ఆయనపై ఉంది. ఇటీవల పాత కమిషనర్ డిజిటల్ సంతకంతో కొన్ని సర్టిఫికేట్‌లు జారీ అయినట్లు కార్యాలయవర్గాల్లో వినికిడి. జారీ అయిన సర్టిఫికేట్‌లలో ఒకటి ఆర్డీవో సుబ్రహ్మణ్యం దృష్టికి వెళ్లింది. రిలీవ్ అయిన తర్వాత కూడా ప్రస్తుత తేదీలతో తన డిజిటల్ సంతకంతో సర్టిఫికేట్ జారీ అవ్వడం చూసి అవాక్కయ్యారు. వెంటనే సంబంధిత మున్సిపల్ సిబ్బందికి గట్టి క్లాస్ పీకారు. ఎన్.ఐ.సి అధికారులతో మాట్లాడి తన డిజిటల్ కీని నిలుపుదల చేసుకోవడానికి ఈ నెల 24వ తేదీన ప్రతిపాదన పెట్టుకున్నారు.

ఇది కమిషనర్ల నిర్లక్ష్యమే!

పాత కమిషనర్లు బదిలీపై వెళ్లే క్రమంలో తప్పనిసరిగా తమకు చెందిన రెండు డిజిటల్ కీలను తీసుకువెళ్లాలి లేదంటే వాటిని ఎన్.ఐ.సి అధికారులతో మాట్లాడి నిలుపుదల చేసుకోవాలి. పాత కమిషనర్ బదిలీపై వెళ్లి రెండు నెలల అయిన కూడా ఎందుకు ఒక డిజిటల్ కీని తీసుకువెళ్లలేదో ఆయనకే ఎరుక. కమిషనర్ల సీసీల వద్ద డిజిటల్ కీలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. రెండు నెలలుగా పాత కమిషనర్ తాలుకు డిజిటల్ కీ తన వద్దే ఉన్నట్లు సీసీ ధ్రువీకరించారు. రెండు నెలల వ్యవధిలో డిజిటల్ కీతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆన్‌లైన్ టెండర్‌ల్లో ఎన్నింటికి వాడారో తేల్చాల్సి ఉంది. కొత్త కమిషనర్ సైతం విధుల్లో చేరిన 40 రోజులకు డిజిటల్ కీ కోసం అప్లై చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఎన్ని సర్టిఫికెట్లు జారీ అయ్యాయో!

పాత, కొత్త కమిషనర్ల మార్పు సమయంలో ఎటువంటి సర్టిఫికెట్‌లు జారీ అవ్వలేదని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. మున్సిపాల్టీలో ప్రతిరోజు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పదుల సంఖ్యలో జారీ అవుతాయి. ఈ క్రమంలో కొత్త కమిషనర్ రాక మునుపు వరకు 15 రోజుల పాటు ఎన్ని సర్టిఫికేట్‌లు జారీ అయ్యాయో అధికారులకే తెలియాలి.

డిజిటల్ కీల అప్‌డేట్ బాధ్యత మున్సిపల్ మేనేజర్‌ది

కొత్త కమిషనర్ వచ్చినప్పుడు ఆయన పేరున కొత్త డిజిటల్ కీకి అప్లై చేయాల్సిన బాధ్యత, పాత డిజిటల్ కీలను రద్దు చేసుకోవాల్సిన బాధ్యత మున్సిపల్ మేనేజర్, కమిషనర్‌లది. లావాదేవీలు సాఫీగా సాగాలంటే ఇది తప్పనిసరి. కానీ ఇక్కడ మేనేజర్ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కమిషనర్‌లు మారినప్పుడల్లా డిజిటల్ కీలను పర్యవేక్షించాల్సిన బాధ్యత మేనేజర్‌ది. కొత్త కమిషనర్ వచ్చి 40 రోజుల తరువాత కమిషనర్ పేరున ఈ నెల 24వతేదీన డిజిటల్ కీ కోసం అప్లై చేశారు. మేనేజర్ ఈ విషయంలో బాధ్యతరహిత్యంగా వ్యవహరించడం

మిగతా 6లో..

దంపతుల ఆత్మహత్యాయత్నం

- భార్య మృతి, గాయాలతో బయటపడ్డ భర్త
- జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఘటన

6లో

గుడ్లవల్లేరులో రహస్య కెమెరాల్లేవ్

- స్నానాల గదుల్లో వీడియోలు తీయలేదు
- ఢిల్లీ, పుణె నిపుణులు నిర్ధారించారు
- అత్యున్నత స్థాయిలో విచారణ జరిగింది
- కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్పీ వెల్లడి

6లో

క్షణికావేశం!

» దంపతుల ఆత్మహత్యాయత్నం

» భార్య మృతి, ఆసుపత్రిలో భర్త



పిల్లలతో వాసవి (ఫైల్)



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపీకృష్ణ

మచిలీపట్నంటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇరువురిదీ వేర్వేరు కులాలు.. పెద్దలు కాదన్నా ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పదమూడేళ్లు కాపురం చేసారు.. ఇద్దరు పిల్లలు పుట్టారు.. అంతలోనే ఏం జరిగిందో ఏమో.. చిన్నపాటి మనస్పర్థలు.. పిల్లలున్నారని తెలిసీ క్షణికావేశంలో ప్రాణాలను పణంగా పెట్టారు. సూర్యోదయానికి ముందే ఎవరికీ తెలియకుండా ఆత్మహత్య చేసుకుందామనుకున్నారు. దానికి రైలు పట్టాలను ఎంచుకున్నారు. అంతే.. బుద్దాలపాలెంలో వేగంగా వస్తున్న రైలుకు ఎదురెళ్లి పట్టాలపై ఒక్కఉదుటున దూకేశారు. యువతి అక్కడికక్కడే మృతి చెందగా.. యువకుడు రైలు తాకిడికి పట్టాలకు దూరంగా వెళ్లి పడ్డాడు. దీంతో చేతికి బలమైన గాయమైంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఈడేపల్లికి చెందిన ఉప్పాల గోపీకృష్ణ(36) 2011లో వాసవి(32)ని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. గోపీకృష్ణ జొమోటో కంపెనీలో పని చేస్తున్నాడు. వాసవి స్వీట్స్ దుకాణంలో పనిచేస్తోంది. వీరికి ఎనిమిదేళ్ల బాలుడు, ఆరేళ్ల బాలిక ఉన్నారు. వీరి మధ్య ఇటీవల తీవ్ర మనస్పర్థలు ఏర్పడ్డాయి. గోపీకృష్ణ తన పెంపుడు కుక్కను తీసుకువెళ్లి చికిత్స చేయాలని మూడు నెలల క్రితం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో గోపీకృష్ణ మానసికంగా ఒత్తిడికిలోనై భార్యతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి చెంది క్షణికావేశంలో ఇద్దరూ ఆత్మహత్య చేసుకునేందుకు సోమవారం ఉదయం బైక్‌పై వెళ్లారు. బుద్దాలపాలెం వద్ద ఉదయం 4 గంటలకు గుడివాడ నుంచి వస్తున్న రైలు కింద దూకేందుకు ప్రయత్నించగా భార్య తీవ్రంగా వారించి నచ్చచెప్పింది. గోపీకృష్ణ ససేమిరా అనడంతో ఇద్దరూ రైలుపట్టాలపై దూకారు. వాసవి అక్కడికక్కడే మృతి చెందగా.. పట్టాలకు పక్కగా పడిన గోపీకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిని కోల్పోయిన పిల్లలు వెక్కి వెక్కి ఏడుస్తుంటే ఓదార్చడం బంధువుల వల్ల కాలేదు. వాసవి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీమ్ ఎన్టీఆర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

'టీమ్ ఎన్టీఆర్‌గా జిల్లాను నెంబర్ వన్ చేద్దాం.. జిల్లాలో అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధిని సాధిద్దాం. గత కలెక్టర్లు వేసిన బాటలో.. ప్రజాప్రతినిధుల సహకారం, అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రగతిని సృష్టిద్దాం.. ఎన్టీఆర్ జిల్లా అంటే టాప్-3లో ఉండేలా అంతకు మించి అగ్రస్థానంలో కొనసాగేలా కృషి చేద్దాం' అని జిల్లా నూతన కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సోమవారం లక్ష్మీశ ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో జేసీ నిధి మీనా, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్యల సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కనకదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్న లక్ష్మీశ నేరుగా కార్యాలయానికి వచ్చారు. పురోహితుల ఆశీర్వాదాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ బాధ్యతలు స్వీకరించారు.

జీరో పెండింగ్‌తో సత్ఫలితాలు

జిల్లా యంత్రాంగం పరిధిలో ఏ శాఖలోనూ పెండింగ్ అనేది కనిపించకూడదని చెప్పారు. జీరో పెండింగ్ ద్వారా సత్ఫలితాలు సాధింగలమని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉంచేలా అందరం సమష్టిగా పనిచేద్దామన్నారు. టాప్-3లో నిరంతరం ఉండేలా లక్ష్యాలను నిర్దేశించి ఆచరణలో అమలు చేసి చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలను విస్తృతంగా ముందుకు తీసుకు వెళ్లాలని, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను నూరుశాతం దిగ్విజయంగా అమలు చేద్దామని చెప్పారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుందామన్నారు.

● గతంలో ఏ కలెక్టర్ చేయని విధంగా జిల్లా యంత్రాంగం అతి ముఖ్యమైన రెవెన్యూశాఖకు సంబంధించి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందరితో ఒకేసారి ఇంటరాక్ట్ అయ్యారు. ప్రతి ఒక్కరి పేరునూ అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయిలో పెండింగ్ లేకుండా ఇకపై సరికొత్త పాలన అందిద్దామని సూచించారు.



సమావేశానికి హాజరైన ఎన్టీఆర్ జిల్లా అధికారులు

హెల్ప్ డెస్క్ పరిశీలన..

కలెక్టర్ లక్ష్మీశా గ్రీవెన్స్ నిర్వహిస్తూనే అర్జీదారుల హెల్ప్‌డెస్క్ కేంద్రాన్ని పరిశీలించారు. హెల్ప్‌డెస్క్‌లో అర్జీదారులకు ఎలాంటి సహాయం అందుతుంది? అర్జీలను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేస్తున్నారు? ఆయా శాఖలకు ఏ విధంగా పంపుతున్నారు? నెట్‌వర్క్ స్పీడ్ ఎలా ఉంది వంటి అంశాలను పరిశీలించారు. వరద బాధితులకు సంబంధించిన దరఖాస్తులను అప్‌లోడ్ చేయాల్సిందిగా సిబ్బందికి సూచించారు.



జిల్లాకు రావటం ఆనందంగా ఉంది

రాష్ట్రంలో కీలకమైన ఎన్టీఆర్ జిల్లాకు కలెక్టర్‌గా రావటం ఆనందంగా ఉంది. కీలకమైన జిల్లాకు కలెక్టర్‌గా ప్రజలకు సేవలందించే అవకాశాన్ని నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పగించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తాం. సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలుపుతాం.

» సమష్టిగా సమగ్రాభివృద్ధి సాధిద్దాం

» ఎన్టీఆర్ జిల్లా టాప్-3లో ఉండాలి

» ఏ శాఖలోనూ పెండింగ్ కనిపించొద్దు

» పర్యాటకం, స్కిల్ డెవలప్‌మెంట్స్‌పై దృష్టి

» స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు జిల్లా వేదిక కావాలి

» జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

సీఎం చంద్రబాబును కలిసి..



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశ గ్రీవెన్స్ అనంతరం సచివాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువచేయాలని లక్ష్మీశాకు ముఖ్యమంత్రి సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు

జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీశాను జేసీ నిధి మీనా అభినందించారు. మునిసిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, డీఈవో యూవీ సుబ్బారావు, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ జి.సుమన్, డీఎస్‌వో పాపారావు, డీపీవో పి.లావణ్యకుమారి, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, సీపీవో వై శ్రీలత, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి, డీఎం సివిల్ సప్లయిస్ తోట వెంకట సతీష్, మార్క్‌ఫెడ్ డీఎం కె.నాగమల్లిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎస్ విద్యాసాగర్, ఏపీఎంఐపీసీ పీడీ పీఎం సుభాని తదితరులు కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

లిఫ్ట్‌లో ఎమ్మెల్యే వెనిగండ్ల, వైద్యులు!

» బయటకు రాలేక.. ఆక్సిజన్ అందక ఇబ్బందులు



గుడివాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ ఆర్కా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో అపశృతి దొర్లింది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, డాక్టర్ మాగంటి శ్రీనివాస్, ఆసుపత్రి వైద్యులతో పాటు పలువురు అరగంట పాటు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. ఆక్సిజన్ అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే లిఫ్ట్‌లో వైద్యులు కూడా ఉండటంతో ఎటువంటి దుర్ఘటన చోటుచేసుకోలేదు. సంఘటనా స్థలానికి చేరుకుని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు పరిస్థితిని సమీక్షించారు. అతి కష్టంపై లిఫ్ట్ డోర్‌లను ఆసుపత్రి సిబ్బంది తెరిచారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లిఫ్ట్ నిర్వహణలో అలసత్వంపై ఆసుపత్రి నిర్వాహకులపై టీడీపీ నేతలు మండిపడ్డారు.

భార్య హత్యకేసులో భర్త అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

కూచిపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భార్య హత్య కేసులో భర్తను అరెస్టు చేసి మొవ్వ కోర్టులో హాజరుపర్చినట్టు పామర్రు సీఐ వి.శుభాకర్ తెలిపారు. మొవ్వ మండలం పెదసనగల్లు గ్రామానికి చెందిన తుపాకుల అశోక్ భార్య శివ పార్వతిపై అనుమానంతో ఈనెల 22వ తేదీ అర్ధరాత్రి పచ్చడి బండతో కొట్టి హత్య చేసిన విషయం విదితమే. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు అశోక్‌ను పెదసనగల్లు శివారు దర్మాపురంలో సోమవారం అదుపులోకి తీసుకుని మొవ్వ కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

యువతకు స్ఫూర్తి 'యువకెరటాలు'

» మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యువతకు స్ఫూర్తిదాయకంగా 'యువకెరటాలు' కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం యువతను నిస్తేజం చేసిందన్నారు. యువతను చైతన్యపరుస్తూ నూతన ఉత్సాహం కలిగించేందుకు 2025 జనవరి మొదటి వారంలో 'యువకెరటాలు' కార్యక్రమం, ఫిబ్రవరిలో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. పోర్టు నిర్మాణం, షిప్పింగ్ హార్బర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. నగరంలో రోడ్ల పెండింగ్ పనులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా ఇంటర్ కాలేజీస్ యూత్ ఫెస్టివల్ బ్రోచర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డిసెంబరు 10 నుంచి 12 వరకు విజయవాడ కేబీఎన్ కళాశాలలో కృష్ణాతరంగ్ అంతర్ కళాశాల విద్యార్థులకు పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర్, ఆర్డీవో స్వాతి, డీఈవో రామారావు, డీఎస్పీ అబ్దుల్ సుభాన్, కమిషనర్ బాపిరాజు, టూరిజం శాఖాధికారి రామ్‌లక్ష్మణ్, ఆర్అండ్‌బీ ఈఈ లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో మోడ్రన్ అంగన్వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించిన నటుడు కబీర్ బేడీ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

మోడ్రన్ అంగన్వాడీ పాఠశాల ప్రారంభం

గుడ్లవల్లేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేర్ టు యాక్ట్ ఇటలీ సంస్థ ఆధ్వర్యంలో పేద వర్గాలను ఆదుకొనే మంచి కార్యక్రమాలు నిర్వహిచడం అభినందనీయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడ్లవల్లేరు ఇందిరా కాలనీలో ఇటలీకి చెందిన 'కేర్ టు యాక్ట్' సంస్థ రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన మోడ్రన్ అంగన్వాడీ ప్రీ ప్రైమరీ పాఠశాలను బాలీవుడ్ నటుడు కబీర్ బేడీతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. రాష్ట్రంలో పేద వర్గాలకు ఆర్థిక ప్రగతి చేకూర్చేలా కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ మోడ్రన్ అంగన్వాడీ పాఠశాలే ఉదాహరణ అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేసేందుకు ముందుకురావాలని రాము అన్నారు. నటుడు కబీర్ బేడీ మాట్లాడుతూ, ప్రజలకు మంచి చేయాలనుకొనే ఇటువంటి సంస్థలకు ప్రజా ప్రతినిధుల సహకారం ఎనలేనిదని కొనియాడారు. తొలుత ఇటలీ సంస్థ ప్రతినిధులను గ్రామస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా కబీర్ బేడీ కోలాట నృత్యం చేయగా వారితో ఇటలీ ప్రనిధులు జతకలిశారు. కార్యక్రమంలో ఏపీ వేర్‌హౌసింగ్ సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన గుడివాడ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, వల్లభనేని వెంకట్రావు, వెంకట సుబ్బారావు చౌదరి, చాపరాల బాలాజీ, పొట్లూరి రవికుమార్, జంగం మోహనరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా చాంపియన్ కృష్ణా



విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పటమట జడ్పీ ఉన్నతపాఠశాలలో రెండురోజుల పాటు జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ అండర్-13 బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి కృష్ణా జట్లు చాంపియన్‌షిప్ వశం చేసుకున్నాయి. క్రీడాకారులు తిరుగులేని ఆధిక్యత కనబరిచి విజేతలుగా నిలిచారు. బాలుర ఫైనల్స్‌లో అనంతపురంపై 15-9, 15-11తో, బాలికల ఫైనల్స్‌లో పశ్చిమగోదావరిపై 15-6, 15-2తో జయభేరి మోగించాయి. రెండు విభాగాల్లో మూడో స్థానాల్లో తూర్పుగోదావరి, నెల్లూరు జట్లు నిలిచాయి. ట్రోఫీల ప్రదానోత్సవంలో కేజీబీవీ పాఠశాలల రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానంద్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.రమేష్, హెచ్‌ఎం ఎం.శాంతి, రాష్ట్ర మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ కోశాధికారి ఎన్.రాఘవులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్టు పరిశీలకుడు ఏపీ రాజు ప్రకటించారు.

బాలురు జట్టు : ఎండీ జాకీర్ అహ్మద్, ఎస్.కార్తీక్(కృష్ణా), ఎం.రేవంత్(అనంతపురం), జి.సందీప్(తూర్పుగోదావరి), కె.అభిలాష్(పశ్చిమగోదావరి), బాలికలు: వి.కావ్య, ఎండీ రెహన్నుమ(కృష్ణా), కె.వర్షిణి(పశ్చిమగోదావరి), ఎన్ కవిత(నెల్లూరు), ఎం భానుప్రియ(అనంతపురం).

గడువులోగా పరిష్కరించాల్సిందే

» క్షేత్రస్థాయి అధికారులతో నిరంతర సమన్వయం అవసరం

» పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 71 అర్జీలు : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనను ప్రజలకు మరింత చేరువచేసే ఉద్దేశ్యంతో, ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమం ద్వారా అందే ప్రతి అర్జీని నిర్దిష్ట గడువులోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, డీఆర్ఓ ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీ అందిన వెంటనే క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకొంటూ నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. పీజీఆర్ఎస్ అర్జీలతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, నైపుణ్యాభివృద్ధి తదితరాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రాధాన్య పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో జిల్లాను ముందు నిలిపేలా టీం ఎన్టీఆర్ కృషి చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి అధికారులను సమన్వయం చేసుకోవాలన్నారు. అర్జీల పరిష్కార ప్రక్రియ పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియతో పాటు హెల్ప్ డెస్క్‌లను కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ

మచిలీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపరిష్కార వేదిక అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కృష్ణా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ప్రజాసమస్యలపై వచ్చిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు.

మచిలీపట్నంనగరం కాలేఖాన్‌పేటకు చెందిన వీరరాఘవులు తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారిని పాఠశాలలో చేర్పించేందుకు ఆధార్‌కార్డులు ఇప్పించాలని కోరుతూ అర్జీఅందజేశారు. పెనమలూరుమండలం గంగూరుకుచెందిన జి.శిరీష తాను దివ్యాంగురాలినని, పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేసింది. ఓబీసీ కులగణన చేయాలని కోరుతూ జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు కేవీవీ సత్యనారాయణ, అందేజగదీష్, పి నాగరాజు అర్జీ అందజేశారు. స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దత్తత వారోత్సవాలలో భాగంగా మాతృత్వం ఒక వరం, దత్తత దానికి మరోమార్గం అనే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. వివిధశాఖల అధికారులు మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు.

జనన, మరణ ధ్రువ పత్రాల జారీలో అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

పలు అనుమానాలకు దారితీస్తోంది.

పాత కమిషనర్ల కీలను వాడటం ఇక్కడ అలవాటే..

ఐదేళ్ల వ్యవధిలో ముగ్గురు కమిషనర్‌లు మారారు. పాత కమిషనర్‌ల డిజిటల్ కీని కొత్త కమిషనర్‌ల హయాంలో వాడిన సందర్భాలు కోకొల్లలు. ఈ విధంగానే మ్యుటేషన్ పేరుతో కోట్లాది రూపాయలు నొక్కేశారు. కమిషనర్‌గా మురళీకృష్ణ హయాంలో పాత కమిషనర్ సంపత్‌కుమార్ సంతకంతో, బాలసుబ్రహ్మణ్యం హయాంలో మురళీకృష్ణ డిజిటల్ సంతకాలను వాడి భారీ స్థాయిలో మ్యుటేషన్‌లలో మార్పులు చేసిన విషయం విదితమే. ఇప్పుడు ప్రస్తుత కమిషనర్ బి.శ్రీనివాసరావు హయాంలో పాత కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం డిజిటల్ సంతకాలతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ అయినట్లు సమాచారం. కమిషనర్‌ల డిజిటల్ కీని వాడుకోవడంలో కొందరు మున్సిపల్ అధికారులు సిద్ధహస్తులు.

నిర్లక్ష్యమా.. ఉద్దేశ్యపూర్వక తప్పా?

పాత కమిషనర్, ప్రస్తుత మున్సిపల్ ప్రత్యేకాధికారి జి.బాలసుబ్రహ్మణ్యం బదిలీపై వెళ్లినప్పుడు ఒక డిజిటల్ కీ తన వెంట తీసుకువెళ్లి జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ఆన్‌లైన్ టెండర్‌ల ప్రక్రియ కోసం వాడే డిజిటల్ కీని ఎందుకు, ఏ కారణం చేత తీసుకువెళ్లలేదో ఆయనే బహిర్గతపరచాలి. ఇది ఆయన నిర్లక్ష్యమా.... లేదా ఉద్దేశపూర్వకంగానే ఇక్కడ విడిచి వెళ్లారా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఇంత తతంగం జరిగిన కారకులైన వారిపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖపరమైన చర్యలు చేపట్టకుండా ఎందుకు గమ్మున ఉన్నారో అధికారులు సమాధానమివ్వాలి. జరిగినది చిన్న తప్పు కాదని, కొందరి జీవితాలు సర్టిఫికేట్‌లతో ముడిపడి ఉంటాయనే ఇంగితం కూడా అధికారులకు లేకుండా పోయింది. మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన సమయంలో వాడిన డిజిటల్ కీ తన వద్దనే ఉందని ఆర్డీవో జి. బాలసుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. కీ తన వద్దనే ఉంటే ఎలా ఆయన సంతకంతో సర్టిఫికేట్ జారీ అయ్యిందో అని అడిగితే టెక్నికల్ సమస్యతో జారీ అయ్యిందని, దానిని వెంటనే పరిష్కరించామని ఆర్డీవో తెలిపారు.

పాత కమిషనర్ డిజిటల్ కీ నా వద్దనే ఉంది

\- కమిషనర్ సీసీ చంద్రశేఖర్

పాత మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం జనన, మరణ డిజిటల్ కీ తన వద్దనే ఉందని కమిషనర్ సి.సి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఇటీవల జారీ అయిన సర్టిఫికేట్‌లో పాత కమిషనర్ సంతకం ఉండటం, దానిని ఆర్‌డివో గమనించడంతో వెంటనే డిజిటల్ కీని క్యాన్సిల్ చేసుకునేందుకు ప్రతిపాదనలు పెట్టుకున్నట్లు సమాచారం. నా దగ్గర అంటే, నా దగ్గరే ఉందని పాత కమిషనర్, కమిషనర్ సి.సిలు తెలపడం అనుమానాలకు తావిస్తోంది.

సర్టిఫికెట్ జారీ అయిన మాట వాస్తవమే

\- శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

పాత కమిషనర్ డిజిటల్ సంతకంతో ఒక్క సర్టిఫికేట్ జారీ అయిన మాట వాస్తవమేనని, దానిని పరిశీలించగా టెక్నికల్ సమస్యతో తప్పుగా పాత కమీషనర్ సంతకం ముద్రించబడిందని మున్సిపల్ కమీషనర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. వెంటనే ఈ విషయాన్ని జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్.ఐ.సి అధికారులతో మాట్లాడి పరిష్కరించామని తెలిపారు. ఎటువంటి సర్టిఫికేట్‌లను వెనక్కి తీసుకోలేదని స్పష్టం చేశారు.

సర్టిఫికెట్‌దారుల పరిస్థితి అగమ్యగోచరం

ఈ తరహాలో ఒకరి హయాంలో ఒకరి సంతకాలతో సర్టిఫికేట్‌లు జారీ చేయడం పట్ల సర్టిఫికేట్‌దారుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఒక ఉన్నతాధికారి ఉండగా బదిలీపై వెళ్లిపోయిన ఉన్నతాధికారి డిజిటల్ సంతకంతో సర్టిఫికేట్‌లు జారీ అయ్యి, సర్టిఫికేట్‌పై ఎంక్వైరీలు జరిగితే ఖచ్చితంగా ఫోర్జరీ డాక్యుమెంట్‌గానే భావిస్తారని నిపుణులు చెబుతున్నారు.

కొడాలి మెడకు మెరక ఉచ్చు

(5వ పేజీ తరువాయి)

ఖాతాలోకి రెండు విడతలుగా రూ.18,30,047, రూ.13,50,047 జమ అయ్యాయి. అదే రోజు మదన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌కి రూ.2,00,014 జమ అయ్యాయి

● బలుసుపాటి రాంప్రసాద్ పేరుతో 060854209010170306 నంబరుతో వర్క్ ఆర్డర్ ఇచ్చారు. ఈయన పనులు పూర్తి చేసినట్లు నిర్ధారించి 2021 జనవరి 25న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆయన ఖాతాలోకి రెండు విడతలుగా రూ.37,25,340 చొప్పున జమ చేశారు. ఆ నిధులు అదే రోజున ఆయన రూ.40 లక్షలు, రూ.34 లక్షలు చొప్పున నగదు రూపంలో డ్రా చేశారు.

● మల్లిపెద్ది అభిషేక్ పేరుతో 060854209010170307/70309 నంబర్లతో రెండు వర్క్ ఆర్డర్లు ఇచ్చారు. ఈయన పని పూర్తి చేసినట్లు నిర్ధారించిన డ్వామా పీడీ 2022 జూలై 21న రూ.1,12,25,642 కోట్లు ఆయన ఖాతాలో జమ చేశారు. ఈ నిధులు మరుసటి రోజే శివ గోల్డ్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.42 లక్షలు, శ్రీలలిత ఫిష్ ప్యాకింగ్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.22 లక్షలు, ఎస్ఎస్ఆర్ ఆక్వాఫీడ్స్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.48 లక్షలు జమ అయ్యాయి.

● మందా దీప్తి పేరుతో వర్క్ ఆర్డర్ తీసుకోగా ఆమె ఖాతాలోకి డ్వామాపీడీ రూ.2.24 కోట్లు 2022 జూలై 15న జమ చేశారు. సరిగ్గా వారం రోజులు తిరగకముందే అంటే జూలై 21న మందా దీప్తి ఖాతా నుంచి రామకృష్ణా టౌన్‌షిప్ పేరుతో ఉన్న ఖాతాలోకి రూ.2.15 కోట్లు జమ కావడం గమనార్హం.

ఇవన్నీ కొడాలి నాని, ఆయన అనుచరుల బినామీ ఖాతాలు కావడం గమనార్హం. రామకృష్ణా టౌన్‌షిప్ పేరుతో హైదరాబాద్‌లో కొడాలి నాని ఆయన అనుచరులు ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఖాతాదారుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు

వర్క్ ఆర్డర్లు ఇచ్చిన వారంతా సామాన్యులు కావడం వారి బ్యాంకు ఖాతాల్లో పెద్ద ఎత్తున డబ్బులు వచ్చిపడటంతో జీఎస్టీ విభాగం వీరందరికీ నోటీసులు ఇచ్చి, జీఎస్టీ చెల్లించాలని ఆదేశించింది. ఈ నోటీసులతో బిత్తరపోయిన ఖాతాదారులు తాము ఇంత డబ్బు ఎక్కడి నుంచి తీసుకొచ్చి కడతామని గగ్గోలుపెడుతూ తమ ఖాతాలను ఉపయోగించుకున్న వైసీపీ నేతలకు వద్దకు వెళ్లి నిలదీశారు. అప్పటికే వచ్చిన డబ్బును కాజేసిన వైసీపీ నేతలు తమకు సంబంధం లేదని చేతులు ఎత్తేశారు. దీంతో వారంతా అధికారుల వద్దకు వచ్చి జరిగిన అన్యాయాన్ని వివరించడంతో విజిలెన్స్ అధికారులు వారి నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. అలాగే బ్యాంకు స్టేట్‌మెంట్లను సేకరించిన విజిలెన్స్ అధికారులు ఆ ఖాతాల నుంచి ఎవరెవరికి డబ్బులు వెళ్లాయో పరిశీలించగా నాని బినామీల ఖాతాల్లోకి వెళ్లినట్లు తేలింది. ఈమేరకు నివేదిక సిద్ధం చేసిన విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ నివేదిక అందిన తర్వాత ఏసీబీ ద్వారా ప్రాథమిక దర్యాప్తు చేయించి కేసు నమోదు చేయాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు.

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో

రహస్య కెమెరాల్లేవ్

» స్నానాల గదుల్లో వీడియోలు తీయలేదు

» ఢిల్లీ, పుణె నిపుణులు నిర్ధారించారు

» అత్యున్నత స్థాయిలో విచారణ జరిగింది

» కృష్ణా జిల్లా కలెక్టర్, ఎస్పీ వెల్లడి

గుడ్లవల్లేరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసీ) మహిళా హాస్టల్ స్నానాల గదుల్లో రహస్య కెమెరాలు పెట్టారన్న ఆరోపణల్లో నిజం లేదని కలెక్టర్, ఎస్పీ స్పష్టం చేశారు. 'మహిళా హాస్టల్ స్నానాల గదుల్లో ఎలాంటి రహస్య కెమెరాలు పెట్టలేదు. ఫొటోలు, వీడియోలు తీయలేదు. అన్నిరకాల అత్యాధునిక టెక్నాలజీతో నిర్వహించిన పరిశోధనల్లో ఈ విషయం తేలింది' అని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్ సోమవారం రాత్రి సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. హాస్టల్ విద్యార్థినులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేసు మెరిట్స్‌పై దర్యాప్తు చేసినట్టు పేర్కొన్నారు. 'ఈ ఏడాది ఆగస్టు 29వ తేదీ రాత్రి ఎస్ఆర్‌జీఈసీ మహిళా హాస్టల్లో నాలుగు, మూడో సంవత్సరం విద్యార్థినులు ఉండే ఫ్లోర్‌లో కామన్ బాత్రూమ్‌లలో ఎవరో రహస్య కెమెరాలు ఏర్పాటు చేసి తమ వీడియోలు తీశారని, అవి బయటికి వస్తున్నట్టుగా తోటి విద్యార్థులు చెప్పారని ఆందోళన చేపట్టారు. యాజమాన్యం ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థినులతో లిఖితపూర్వక ఫిర్యాదు తీసుకున్నారు. సున్నితమైన అంశం కావడంతో ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్, ఎస్పీ, పలువురు ఎమ్మెల్యేలను అక్కడికి పంపించారు. బాంబ్ డిస్పోజబుల్ టీమ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, విద్యార్థినులను టీమ్‌గా ఏర్పాటు చేసి వారందరి సమక్షంలో ఎన్ఎల్‌జేడీ పరికరాలతో క్షుణ్ణంగా తనిఖీలు చేయించారు. ఎలాంటి రహస్య కెమెరాలూ లేవని తేలింది. కేసు తీవ్రత దృష్ట్యా సీఎం చంద్రబాబు.. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్‌తోపాటు ముగ్గురు ఐపీఎస్‌లతో అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేశారు. వారి పర్యవేక్షణలో దర్యాప్తు చేయించారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన సీఆర్‌టీ-ఐఎన్ (న్యూఢిల్లీ)తో పాటు పుణె నుంచి సీ-డాక్ సైంటిస్టులను పిలిపించి కాలేజీలోని అన్ని కంప్యూటర్ల సంబంధిత డేటాను క్షుణ్ణంగా తనిఖీలు, విశ్లేషణలు నిర్వహించారు. పలువురు విద్యార్థుల ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లను కూడా తనిఖీ చేయించారు. ఎటువంటి పొరపాటు జరగలేదని నిర్ధారించారు. పలు యూట్యూబ్, సోషల్ మీడియా చానల్స్‌ను విచారించగా... మహిళా హాస్టల్ బాత్రూమ్ వీడియోలు, సాక్ష్యాధారాలు తమ వద్ద ఉన్నట్టుగా చెప్పలేదు. ఎక్కడా రహస్య కెమెరాలు వాడలేదని నిర్ధారణ అయింది' అని కలెక్టర్, ఎస్పీ పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళా, శిశు సంరక్షణాభివృద్ధి శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి సువర్ణ తెలిపారు. మిషన్ వాత్సల్య కింద అవుట్‌రీచ్ వర్కర్లు 1, మేనేజర్ పోస్టు 1, పార్ట్‌టైం వైద్యులు 1, ఆయా 1, చౌకీదార్ 1, కుక్ 1, హెల్పర్‌కం నైట్‌వాచ్‌మెన్ 1, యోగా ఇన్‌స్ట్రక్టర్ 1, ఎడ్యుకేటర్ 1 పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మిషన్ శక్తి పథకం కింద పారా మెడికల్ 1, సెక్యూరిటీ గార్డు 1, నైట్‌గార్డు 3, మిషన్ సాక్ష్యం పథకం కింద బ్లాక్ కో-ఆర్డినేటర్ 1 పోస్టులకు డిసెంబరు 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నసమారాధన

ఉయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట అయ్యప్పస్వామి ఆలయంవద్ద అయ్యప్ప భక్తులకు సోమవారం అన్న సమారాధన ప్రారంభించారు. ప్రతియేటా అయ్యప్పదీక్ష పరులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 40 రోజులపాటు అన్నసమారాధన చేయడం పరిపాటిగా వస్తుంది. పాలడుగు చంద్రశేఖర్, రామకృష్ణ సహకారంతో జరిగిన అన్న సమారాధనలో కమిటీ సభ్యులు ఉషా రామకృష్ణ, బాబ్జీ, జయదేవ్ తదితరులు పాల్గొని సేవలందించారు.



వెలగని లైట్లు!

- ప్రధాన రోడ్లలో విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేసి నాలుగు నెలలు
- నేలకొరుగుతున్న పోల్స్
- నిరుపయోగంగా కోట్లాది రూపాయలు
- పట్టించుకోని ఆర్ అండ్ బీ శాఖ అధికారులు
- జంక్షన్‌లో కలగా సెంట్రల్ లైటింగ్

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)

జంక్షన్‌లోని ప్రధాన రోడ్లలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నిర్లక్ష్యానికి గురవుతోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన లైటింగ్ వ్యవస్థను ఆచరణలోకి తీసుకురాకపోగా అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యుత్ పోల్స్ నేలకొరుగుతున్నాయి. ప్రజలు ఆశించిన సెంట్రల్ లైటింగ్ కలగా మిగిలింది. 16వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జంక్షన్ బైపాస్ ఏర్పడిన నేపథ్యంలో హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారి (ఏలూరు- విజయవాడ రోడ్డు)ని అభివృద్ధి చేసి రాష్ట్ర అర్‌అండ్‌బీ డిపార్టుమెంట్‌కు అప్పగించే ఉద్దేశంతో గతేడాది నేషనల్ హైవే సంస్థ రూ.9కోట్లు మంజూరు చేసింది. వేలేరు అడ్డరోడ్డు నుంచి బొమ్ములూరు అంజనేయ స్వామి ఆలయం వరకు ఏలూరు- విజయవాడ (3.కి.మీ) రహదారి అభివృద్ధితో పాటు సెంట్రల్ లైటింగ్ కోసం 150 పోల్స్ ఏర్పాటు చేశారు. స్థానికుల అభ్యర్థన మేరకు గుడివాడ రోడ్డులో 8, నూజి వీడు రోడ్డుల్లో 6 పోల్స్ నిర్మించారు. జంక్షన్ నాలుగు రోడ్ల సెంటర్,



జంక్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ ల్యాంప్ పోల్



గుడివాడ రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో నేలకొరిగిన విద్యుత్ పోల్

మూలకొట్టు సెంటర్, వేలేరు అడ్డరోడ్డు డివైడర్ల వద్ద భారీ సైజు హైమాస్ట్ ల్యాంప్‌ల కోసం పోల్స్ కూడా నిర్మించారు. కాంట్రాక్టు తీసుకున్న ఒడిస్సాకు చెందిన అబిత్సా సంస్థ ఎన్నికలు ముందు మే నెలలో పోల్స్ నిర్మించి విద్యుత్ వ్యవస్థను కూడా పూర్తి చేసింది. రహదారి నిర్వహణతో పాటు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను రాష్ట్ర అర్‌అండ్‌బీ డిపార్టుమెంట్‌కు ఆ సంస్థ అప్పగించాల్సి ఉంది. నిర్మాణం పూరైన రహదారితో పాటు లైటింగ్ వ్యవస్థను స్వీకరించడానికి ఆర్ అండ్ బీ అధికారులు అసత్వం ప్రదర్శిస్తున్నారు. అధికారుల అలసత్వంతో ఏర్పాటు చేసిన పోల్స్ ఒక్కొ క్కటి విరిగిపోయి నేలకొరుగుతున్నాయి. గత రెండు నెలల కిందట నూజివీడు రోడ్డులో ఏర్పాటు చేసిన ఒక పోల్ వరి గడ్డి వాహనం ఢీ కొనడంతో విరిగి పోయింది. ఆదివారం ఉదయం గుడివాడ రోడ్డులో రైస్ మిల్ వద్ద మరో పోల్ గుర్తు తెలియని వాహనం ఢీ కొనడం నేలకొరిగింది. కోట్లాది రూపాయలు వ్యయంతో నిర్మించిన పోల్స్ శిథిలమవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ లైటింగ్ తో కళకళలాడుతుందని ఆశించిన ప్రజానీకం కల కలగానే మిగిలిపోతోందని ప్రజానీకం వాపోతున్నారు.



రంగా సర్కిల్ వద్ద మొక్కలు నాటుతున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, తదితరులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కంకిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భావితరాల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని కంకిపాడు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. కంకిపాడు రంగా సర్కిల్ వద్ద తుమ్మల ఆంజనేయులు కుమారులు తుమ్మల సాయి, వెంకట మనోజ్‌లు అందించిన మొక్కలను ఆమె నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, కొప్పరాజు సురేష్, టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, ప్రముఖ వైద్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ, స్థానిక టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకట రమణ, చలవాది రాజా, కొండా నాగేశ్వరరావు, బొప్పూడి శివరామకృష్ణ, సుంకర శివ, బోయిన నాగరాజు, కోలవెన్ను విజయ్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

విజయవాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నున్న గ్రామంలోని మెయిన్ రోడ్డు వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలని కోరుతూ గ్రామ వైసీపీ నేత దండు సుబ్రహ్మణ్యంరాజు సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎన్టీపీఎస్ వద్ద నుంచి బొడపాడు వరకు నూజివీడు ప్రధాన రహదారికి ఇరుపక్కలా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు పెరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు.

మీకోసంకు స్పందన కరువు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడం కోసం ప్రతి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు నిర్వహిస్తున్న మీ కోసం కార్యక్రమం పట్ల ప్రజల్లో స్పందన కరువైంది. సోమవారం బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.జోగేశ్వరరావు ఆధ్వర్యంలో మీ కోసం పరిష్కార వేదిక నిర్వహించారు. తహసీల్దార్ నాగభూషణంతో పాటు వివిధ శాఖల అధికారులు కూడా హాజరయ్యారు. కానీ ఒక్క అర్జీ కూడా రాలేదు. ప్రభుత్వం మీ కోసం వేదికతో పాటు 1902 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా సమస్యలను ఎకరవు పెట్టుకునే సౌకర్యం కూడా కల్పించింది. దీంతో మీ కోసం వేదిక పట్ల ఆసక్తి చూపడం లేదని అధికారుల సైతం అభిప్రాయపడుతున్నారు.

ధాన్యం రైతుపై దాడి

ఉయ్యూరు, నవంబరు 25 : ఎగినపాడు పేదల కాలనీలో ఆరబెట్టిన వడ్లు తొక్కవద్దు అన్నందుకు వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన సోమవారం జరిగింది. ఎగినపాడుకు చెందిన మాట్రు నాగేంద్ర వడ్లు ఆరబెట్టాడు. అ సమయంలో రెడ్‌చిల్లీస్ రెస్టారెంట్ బాబి అతని స్నేహితులు మోటార్ సైకిళ్లపైవచ్చి వడ్లు తొక్కించుకుంటూ వెళ్లారు. దీంతో వడ్లు తొక్కించుకుంటూ వెళ్లడ మేమిటని వారించగా బాబి మరికొందరు తనపై దాడిచేసి గాయపరిచారని నాగేంద్ర ఉయ్యూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జీవాలకు టీకాలు

గన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవాలకు, పశువులకు అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా నివారణ టీకాలు వేస్తున్నట్లు వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ మాచినేని బాలకృష్ణ తెలిపారు. మండలంలోని అల్లాపురంలో లేగ దూడలకు అంటువ్యాధులు రాకుండా సోమవారం బ్రూసిలోసిస్ టీకాలు వేశారు. ఎల్ఎస్ఏ ఎ.ఉమామహేశ్వరరావు, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

హనుమాన్‌జంక్షన్ / రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తీక సోమవారం పురస్కరించుకొని భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాసంలో ఆఖరి సోమవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించి దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకులు శ్యామ్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. 600 మంది భక్తులకు ఆలయ నిర్వాహకుడు గూడవల్లి చిన్నా అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరమాచినేని నాగయ్య, తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు

● పెరికీడు, వీరవల్లి, కాను మోలు, ఆరుగొలను గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుఝాము నుంచి భక్తులు బారులు తీరారు. పెరికీడు ముక్తేశ్వరాలయంలో అర్చకులు శ్యామ్, కానుమోలులో శివాలయంలో అర్చకులు పవన్‌శర్మ, వీరవల్లి కొండేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు మురళీ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.



ఉయ్యూరు ఆర్డీవో హెలాషారోన్‌కు సమస్యలు వివరిస్తున్న రైతులు

ధాన్యం తరలింపు వేగవంతం చేయాలి

ఉయ్యూరు ఆర్డీవోకు రైతు నేతల వినతి

ఉయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల నేపథ్యంలో పొలాల్లోని ధాన్యం మిల్లులకు తరలింపు వేగవంతం చేయాలని ఉయ్యూరు ఆర్డీవో హెలా షారోన్‌కు రైతు నాయకులు విన్నవించారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, పాలడుగు ఆశోక్ పలువురు రైతులు సోమవారం ఆర్డీవోను కలసి రైతుల పరిస్థితిని వివరించారు. కొందరు మిల్లర్లు గోదాములు ఖాళీ లేవని ధాన్యం దిగుమతి చేసుకోపోవడంతో ధాన్యం లోడుతో వెళ్లిన వాహనాలు రోజుల తరబడి నిలిచిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోపక్క కోతకోసిన ధాన్యం ఆరబెట్టుకునే అవకాశం, స్థలం లేక పొలాల్లో రాసులుగా ఉన్నాయని వాతావరణం మార్పులు భయాందోళనకు గురి చేస్తున్నాయని, పొలాల్లో ధాన్యం మిల్లర్లు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంచుల్లో ధాన్యం నిల్వ ఉండడంవల్ల రంగుమారి నష్టపోతామని వాపోయారు. సమస్యలు సానుకూలంగా విన్న ఆర్డీవో జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతు నాయకులు సజ్జా వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, బ్రహ్మం, తాతినేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు

కంకిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదుపై విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరముందని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. ఈడుపుగల్లులో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు ఉత్సాహంగా ముందుకొస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, మాజీ సర్పంచ్ షేక్ మాబు సుబాని, గ్రామ టీడీపీ అధ్యక్షులు షేక్ షకార్, జిల్లా పార్టీ కార్యదర్శి పందిపాటి సుధాకర్, స్థానిక పార్టీ నాయకులు వెనిగల రమేష్, సుంకర రమేష్, ఎస్కే. హుస్సేన్, మస్తాన్ పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : టీడీపీ బీమా సభ్యత్వ నమోదు కార్యకర్తల జీవితాలకు భరోసా అని ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. రంగన్నగూడెంలో నిర్వహిస్తున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సోమవారం అధ్యక్షుడు మొవ్వా వేణుగోపాల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తుమ్మల దశరధరామయ్య, అర్జునరావు, మొవ్వా శ్రీనివాసరావు, పుసులూరి గాంధీ, కసుకుర్తి రామాంజనేయ చౌదరి, ఆలపాటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



పెనమలూరులో ధర్నా నిర్వహిస్తున్న వణుకూరు గ్రామస్థులు

దాడి కేసు నమోదు చేయాలని ధర్నా

పెనమలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు పోలీసుల తీరును నిరసిస్తూ వణుకూరు గ్రామస్థులు సోమవారం ధర్నా నిర్వహించారు. తమ గ్రామంలో నుంచి ఇసుక ట్రాక్టర్లు వెళ్లొద్దని అడ్డుకున్న యువకుడిపై విచక్షణా రహితంగా దాడి చేసిన వ్యక్తులపై ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు లేవంటూ సోమవారం స్టేషను వద్ద ధర్నా చేపట్టడంతో కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వణుకూరులో ఇసుక ట్రాక్టర్లు నిదానంగా వెళ్లమన్నందుకు ఈ నెల మొదటి వారంలో యువకుడిపై ట్రాక్టర్ డ్రైవరు దాడి చేశాడని, అయితే పెనమలూరు పోలీసులు ఇంత వరకు కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు. పోలీసుల తీరును తప్పు పట్టారు. దీనిపై స్పందించిన సీఐ వెంకటరమణ ఇరు వర్గాల ఫిర్యాదులు పరిశీలించి తగు చర్యలు తీసుకొంటామని తెలపడంతో వివాదం సద్దు మణిగింది.

పాడి పరిశ్రమ అభివృద్ధికి సహకారం

కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ శనగల వెంకట శివజ్యోతి



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా బోర్డు డైరెక్టర్ వెంకట శివజ్యోతి

హనుమాన్ జంక్షన్ రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఆర్థికంగా సహకరించే పాడి పరిశ్రమ అభివృద్ధికి కృష్ణామిల్క్ యూనియన్ చేయూత అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బోర్డు డైరెక్టర్ శనగల వెంకట శివజ్యోతి సూచించారు. హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని మునునూరులో సోమవారం ప్రభుత్వ పశువైద్యశాల సహ కారంతో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పాడి రైతులకు పశుపోషణపై అవగాహనతో పాటు పాల ఉత్పత్తి పెంచేందుకు చేపట్టాలిసిన చర్యల గురించి వివరించారు. 87పైగా పశువులకు వివిధ వ్యాధులకు చికిత్సలు, టీకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గాజుల ఏడుకొండలు, మేనేజర్ మాగంటి హరిబాబు, యూనియన్ డీడీ లింగం ప్రసాద్, ప్రభుత్వ పశువైద్యుడు చైతన్య, ఏడీ లింగయ్య, వెటర్నరీ అసిస్టెంటు, పాడి రైతులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయురాలికి యూటీఎఫ్ ఆర్థికసాయం

గన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కవరం శివారు కంద్రిక ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తోన్న కాంట్రాక్టు ఉపాధ్యాయురాలు సీహెచ్ వెంకట నాగస్వప్న ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం ఎనికేపాడు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం కావడంతో యూటీఎఫ్ మండల శాఖ స్పందించింది. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరిదు వరప్రసాద్ వాళ్ల గ్రూపుతో పాటు తెలిసిన వారందరికి మెసేజ్‌ని ఫార్వాడ్ చేశారు. దీంతో రూ.1,11500 లక్షలు సమకూరాయి. సోమవారం ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందు తున్న ఉపాధ్యాయిని పరామర్శించి మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు ఆ నగదును అందజేశారు. నాయకులు జి.రాజాబాబు, డి.శివప్రసాద్, టి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, జ్ఞానానందం, జేమ్స్, కె.నాగరాజు, శ్రీనివాస్ నాయక్, బాలసుబ్బమ్మ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు

గన్నవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల సమీపాల్లో గుట్కా, పాన్, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర పొగాకు నియంత్రణ లీగల్ అడ్వైజర్ పుట్టి శివశంకర్ అన్నారు. గన్నవరం పట్టణంలో సోమవారం పొగాకు ఉత్పత్తుల నియంత్రణ ర్యాలీ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగింది. పలు షాపులు, కిరాణా దుకాణాలను పరిశీలించారు. అక్కడ పొగాకు హెచ్చరిక బోర్డులు లేని షాపు యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించి దుకాణాల్లో సోదాలు జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న వారిపై స్థానిక పోలీసుల సహకారంతో జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ, నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించకూడదన్నారు. నిషేధిత గుట్కా, సిగరెట్, పొగాకు ఉత్పత్తుల నియంత్రకు కాట్పా చట్టం అమలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరిగిందన్నారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాటూరి హిమబిందు, మండల వైద్యాధికారి డాక్టర్ పర్వతనేని శ్రీహర్ష, ఎస్సై శివ ప్రసాద్, వేల్పూరి సుందర తారక రామారావు, సుబ్రమణ్యం, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో పొగాకు ఉత్పత్తుల నియంత్రణ ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పెనమలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోరంకి టీడీపీ కార్యాలయంలో సోమవారం లక్షన్నర విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధరకాలుగా ఇబ్బందులుపడుతున్న ప్రజలకు ఇతోధికంగా సాయం అందించేందుకే సీఎం సహాయ నిధిని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఊసేలేకుండా పేదల కడుపుకొట్టారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, యాళ్ల చక్రవర్తి, ఏనుగు శ్రీనివాస్, సలీం తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

ఉంగుటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు దత్తత కుమార్తె త్రివేణి (18)ఆదివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలుకపాడు గ్రామానికి చెందిన అజ్మీర వెంకటేశ్వరరావు, గోపి అన్నదమ్ములు, గోపి కుమార్తెను వెంకటేశ్వరరావు దత్తత తీసుకున్నాడు. బీఎస్సీ డిగ్రీ ప్రైవేటుగా ప్రిపరేషన్ అవుతోంది. ఈ నేపథ్యంలో పొలంలో చల్లిన విషపుమందు ఆహారపదార్థాలపై పడ టంతో ఆ ఆహారాన్ని ఈ నెల 19న పొరపాటున భుజించింది. వాంతులు కావడంతో గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్సకోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ 24 వతేదీ ఆదివారం రాత్రి మృతి చెందింది. సోమవారం ఉదయం పోస్టుమార్టమ్ అనంతరం త్రివేణి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పెదనాన్న అజ్మీర వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

హర హర మహాదేవ..!

విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు

కృష్ణలంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిసెంబరు 3న జరిగే అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలను నవంబరు 28న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయో వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు వి.కామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు 6 నుంచి 15 ఏళ్లలోపు, 15 ఏళ్ల పైబడిన విభిన్న ప్రతిభావంతులకు, బాలబాలికలకు, పురుషులకు, స్త్రీలకు విడివిడిగా నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని ఆసక్తి గల విభిన్న ప్రతిభావంతులు, ఆటల పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థిక పురోభివృద్ధి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆర్థిక పురోభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.12లక్షల విలువైన 14 చెక్కులను బాధితులకు సోమవారం నేరుగా ఆయన పలు డివిజన్లలో పర్యటించి అందజేశారు. 2, 7, 12 డివిజన్లలో బాధితులకు చెక్కులను అందజేసిన ఆయన స్థానికులతో మాట్లాడుతూ ఆర్థికంగా రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు పెన్షన్లు, సంక్షేమ పథకాలు, సీఎం సహాయనిధికి నిధుల మంజూరులో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆయా డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్టేట్ ఓపెన్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని డీఎస్ఏ హాల్లో ఈ నెల 27,28న ఏపీ ఓపెన్ జూనియర్ (అండర్-20) బాలబాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ నాగం సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు 2005 జనవరి 1, నుంచి 31 అక్టోబరు 2011 మధ్యలో జన్మించిన, అసోసియేషన్ గుర్తింపు కార్డు కలిగినవారు అర్హులన్నారు. తమ రిజిస్ట్రేషన్‌ను గూగుల్ షీట్ ఆన్‌లైన్ ఫామ్ ద్వారా 27న ఉదయం 8 గంటల్లో నమోదు చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత ఫెన్సింగ్ క్రీడా పరికరాలతో హాజరు కావాలన్నారు.



మాట్లాడుతున్న ఏపీవీఎల్ చైర్మన్‌గా పి.వి.లక్ష్మయ్య

ఏపీవీఎల్ చైర్మన్‌గా పి.వి.లక్ష్మయ్య

సత్యనారాయణపురం, నవంబరు 25: ఏపీవీఎల్ చైర్మన్‌గా ఐఏఎస్ అధికారి డా. పి.వి.లక్ష్మయ్యను ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ముత్యాలంపాడు పశుసంవర్థకశాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏపీ వెటరనరి కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఏపీ వెటర్నరీ కౌన్సిల్‌లోని అఫిసియో సభ్యులు ముగ్గురు, ఎలక్ట్రోల్ సభ్యులు నలుగురు, నామినేటేడ్ సభ్యులు నలుగురు ఏపీవీఎల్ చైర్మన్‌గా డా.పి.వి.లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెటనరీ చట్టాన్ని అనుసరించి సభ్యులు నడుచుకోవాలని, వెటర్నరీ క్లీనిక్స్, ఏపీ వీసీ లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని తీర్మానించారు. డైరెక్టర్ ఆఫ్ యానిమల్ హస్‌బెండరీ డి. దామోదర నాయుడు. వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జేవీ రమణ, రిజిస్ట్రార్ ఆఫ్ వెటర్నరీ కౌన్సిల్ డా.ఈశ్వర్, ఎలక్ట్రోల్ సభ్యులు డా. సుబ్బారెడ్డి, డా. రాజశేఖర్, డా. లోకేష్ పాల్గొన్నారు.



గాత్రకచేరీ చేస్తున్న మల్లాది సోదరలు

అలరించిన మల్లాది సోదరుల గాత్రకచేరీ

విజయవాడ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురం శివరామకృష్ణ క్షేత్రంలో శ్రీ సద్గురు సంగీత సభ 31వ వార్షిక సంగీత మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ప్రముఖ గాత్ర విద్వాంసులు మల్లాది సోదరులుగా ఖ్యాతిగాంచిన శ్రీరాం ప్రసాద్, రవి కుమార్ గాత్ర కచేరీ రక్తిగా సాగింది. ఆదితాళంలో అసావేరి రాగ వర్ణంతో కచేరీని ప్రారంభించిన సోదరులు తరువాత పూరణచంద్రిక రాగంలో ఆదితాళంలో త్యాగరాజ స్వామి రచన పలుకవేమి నా దైవమా, హరి కాంభోజి రాగంలో చని తోడి తేవె త్యాగరాజు స్వామి రచన, ఇంకా వివిధ వాగ్గేయకారుల రచనలను భక్తితో ఆలపించారు. వీరికి కుమారి మల్లాది సింధు రాగేశ్వరి, మల్లాది శివానంద యశస్వి, ఎం.హరిబాబు వయోలిన్, మృదంగం, ఘటంలపై సమర్థవంతమైన సహకారమందించారు. 3వ రోజు డా.కె.వాగీష్ గాత్రకచేరీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



భద్రిరాజుపాలెంలో విచారణ నిర్వహిస్తున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

గంగానమ్మ జాతరలో గొడవ

● విచారణ చేపట్టిన డీఎస్పీ సుభాన్

● భద్రిరాజుపాలెంలో దళితులను దూషించిన 11 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

తోట్లవల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భద్రిరాజుపాలెం గంగానమ్మ జాతరలో ఆదివారం జరిగిన గొడవ నేపథ్యంలో దళితులను కులం పేరుతో దూషించిన ఘటనపై సోమవారం గుడివాడ డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్ విచారణ నిర్వహించారు. సీఐ చిట్టిబాబు, ఎస్సై అర్జునరాజుతో కలిసి భద్రిరాజుపాలెంలో పర్యటించి ఘటనా వివరాలను తెలుసుకున్నారు. దళితుడినైన తాను గంగానమ్మ గుడి చుట్టూ ట్రాక్టర్ తిప్పితే గ్రామంలోని అగ్రకులం వారు తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని వల్లూరు లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వంశీ కృష్ణారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, పార్థసారథి రెడ్డి, రామిరెడ్డితో కలిపి 11 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు కేసు నమోదు చేశారు. దీంతో ఈ కేసు విచారణను డీఎస్పీ చేపట్టారు.

రాజీ కోసం టీడీపీ, వైసీపీ ప్రయత్నాలు

ఇదిలా ఉండగా ఈ కేసుని రాజీ చేసేందుకు టీడీపీ, వైసీపీ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ వార్తను పత్రికల్లో రాయవద్దని, రెండు పార్టీలు కలిసి రాజీ చేస్తున్నాయని వైసీపీ నాయకుడొకరు ఫోన్ చేయడం గమనార్హం.

● మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రలింగార్చన

వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరుగుతున్న కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్రలింగార్చన సేవ నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా వేదమంత్ర సహితంగా సహస్రలింగార్చన నిర్వహించారు. స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. సహస్రలింగార్చన సేవలో స్వామిని పుష్పాలు, బిల్వాలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్‌తో నయనమనోహరంగా అలంకరించారు.

దుర్గగుడిలో ఊంజల్ సేవ

కార్తీకమాసం, సోమవారం సందర్భంగా గంగా పార్వతీమల్లేశ్వరుల ఉత్సవమూర్తులకు ఊయల సేవ నిర్వహించి వేదమంత్రాలు, భక్తజనుల కోలాహలం మధ్య సహస్రదీపాలంకరణ చేశారు. డిప్యూటీ ఈవో రత్నరాజు పాల్గొని పూజలు చేసి సహస్రదీపాలంకరణలో దీపాలు వెలిగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని, స్వామిని దర్శించుకున్నారు.

కళావేదికపై హరికథాగానం

దుర్గగుడి కళావేదికపై సోమవారం గుడిపాటి జయరామ సుధాకర్ భక్తమార్కండేయ హరికథా గానాన్ని రమణీయంగా వినిపించారు. భక్త మార్కండేయుడు శివుడిని ఆరాధించిన తీరును కళ్లకు కట్టినట్టు అభివర్ణించారు. చావలి కృష్ణమోహన్ మృదంగంపైన, చావలి శ్రీనివాస్ వయోలిన్‌పైన సహకరించారు. డిప్యూటీ ఈవో రత్నరాజు సుధాకర్‌ను అభినందించారు.





డీఈవోకు బ్రాస్‌లెట్ అందజేస్తున్న స్వీపర్లు

బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకున్న భక్తురాలు... తమకు దొరికిందని తిరిగిచ్చిన స్వీపర్లు

హైదరాబాద్‌కు చెందిన బోన పూజిత సాయి తన కుటుంబ సభ్యులతో సోమవారం అమ్మవారిని దర్శించుకోవటానికి దుర్గగుడికి వచ్చారు. అమ్మవారి దర్శనానంతరం తిరిగి వెళుతుండగా ఆమె చేతికున్న రూ.2లక్షలు విలువైన బంగారు బ్రాస్‌లెట్ జారిపోయింది. విషయాన్ని వెంటనే మైక్ సమాచార కేంద్రంలో తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు డ్యూటీలో ఉన్న సూపరింటెండెంట్ అమృతరావు స్పందించి వెంటనే హెడ్ కానిస్టేబుల్ డి.శివాజీ, సీటీ ఈశ్వరరావు, వై.సోమేశ్వరరావుతో కలిసి ఆలయ ప్రాంగణంలో వెతికించారు. ఇదే సమయంలో అక్కడ స్వీపర్లుగా పనిచేస్తున్న దుర్గాదేవి, మంగతాయారుకు ఈ బ్రాస్‌లెట్ దొరికింది. దాన్ని వారు వెంటనే అక్కడున్న సెక్యూరిటీ గార్డు సూరిపోయిన శ్రీధర్‌కు అందజేశారు. ఈ విషయాన్ని చెరువు ఆదినారాయణ మైక్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే పూజిత సాయి డిప్యూటీ ఈవో రత్నరాజును కలిసి వివరాలు చెప్పగా, అందరి సమక్షంలో బ్రాస్‌లెట్‌ను ఆమెకు అప్పగించారు. రూ.2లక్షలు విలువైన 30 గ్రామాల బ్రాస్‌లెట్ దొరికినందుకు ఆమె సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు.



డాక్టర్ లక్ష్మీశాకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను సోమవారం ఎన్టీఆర్ జిల్లా నూతన కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశా కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు, ఈఈ కోటేశ్వరరావు, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, తదితరులు ఆలయ మర్యాదలను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేయగా వేదపండితులు ఆశీస్సులందజేశారు.





శాంతి కల్యాణానికి తరలివెళ్తున్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి

రామలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం

విజయవాడ కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం వరకు నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామి శాంతి కల్యాణం జరిగింది. తదుపరి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామిని దర్శించారు. సంధ్యా సమయంలో ఆకాశదీపం వెలిగించారు. అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం చేసి పంచహారతులిచ్చారు. ఉదయం నుంచి భక్తులు దీపారాధనలు ఆలయ ప్రాంగణంలో అత్యంత భక్తి శ్రద్ధలతో చేశారు. ముఖ్య అర్చకులు జీఆర్‌వీ సాగర్, అభివృద్ధి దాత సంగా నర్సింహారావు, కార్యనిర్వాహణాధికారి ఎన్.భవాని పాల్గొన్నారు.

సోషల్ మీడియాను ఎదుగుదలకే ఉపయోగించాలి

● మంత్రి కొలుసు పార్థసారథి

గుణదల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యువత తమ ఎదుగుదలకు మాత్రమే సోషల్ మీడియాను ఉపయోగించుకుని ఇతర విషయాల్లో దానిపై దృష్టి పెట్టకుండా ఉంటే మంచిదని గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సైబర్ నేరాలపై యువతను చైతన్య వంతుల్ని చేసేందుకు స్థానిక ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో సమాచార శాఖ నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి సారథి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ నేడు ఎంతోమంది యువత సోషల్ మీడియా వల్ల భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వచ్చిన మొదట్లో దేశంలో 19శాతం మంది వాడితే నేడు దేశవ్యాప్తంగా సోషల్ మీడియాను 86 శాతం మంది వాడుతున్నారన్నారు. సోషల్ మీడియాను ఆయుధంగా తీసుకున్న కొంతమంది నేరస్థులు యువతను తప్పుదోవలో నడిపించి దేశ ప్రగతిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీంతో ఎంతోమంది ఆర్థికంగా నష్టపోవడమేకాక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో చైతన్యం లేకపోవడమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రహించారన్నారు. అందుకే సైబర్‌క్రైమ్ పట్ల యువతలో చైతన్యం తీసుకొచ్చేలా పలు కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు



మాట్లాడుతున్న సమాచార శాఖ మంత్రి పార్థసారథి

ఆలోచనలు 2047 నాటికి రాష్ట్ర ప్రగతి ఎలా ఉండాలన్నదానిపై పదును పెట్టారన్నారు. అందులో భాగంగానే నేడు సైబర్ క్రైం నేరస్థులపై ఉక్కుపాదం మోపాలన్న ఆలోచన చేయడం జరుగుతోందన్నారు. సైబర్ క్రైం నేరాలపై కేసులు నమోదు చేయకున్నా తమ దృష్టికి తేవాలన్నారు. సోషల్ మీడియా అనేది మంచికి వాడితే మంచిదే కానీ చెడు ఆలోచనతో వాడామా అణుబాంబు కంటే ప్రమాదకరమైందని స్థానిక 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి అన్నారు. సీనియర్ న్యాయవాది చేకూరి శ్రీపతిరావు, నాగార్జున వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ టీడీ విమల, ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ భరత్ గుప్తా, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, ఈఎస్ఎఫ్ ల్యాబ్స్ నుంచి జి.తిరుమలేశ్వరి పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా గాంధీకొండ ప్లానిటోరియం

వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గాంధీకొండ వద్ద ఉన్న ప్లానిటోరియం విజయవాడకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం విడుదల చేసిన ప్రకటనలో అన్నారు. వన్‌టౌన్‌లోని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే గాంధీహిల్‌లో అంతరిక్ష పరిజ్ఞానం పెంచేందుకు ఏర్పాటు చేసిన ప్లానెటోరియంను ప్రజలందరూ వీక్షించాల్సిందిగా కోరారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా రూ.40 ప్రవేశ రుసుముగా పెట్టినట్టు తెలిపారు. 63 మంది సిట్టింగ్ కెపాసిటీ గల ప్లానిటోరియంను ముఖ్యంగా విద్యార్థినీ, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో పాఠశాలల నుంచి ప్రత్యేక బుకింగ్ చేసుకున్నవారికి 50 శాతం రుసుములో రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. బుధవారం నుంచి ప్రతిరోజూ సాయంత్రం 4





మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ప్లానిటోరియం

నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రతి అరగంటకు షో వేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల/కళాశాలల నుంచి ప్రత్యేకంగా బుకింగ్స్ చేసుకున్న వారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు వారు బుకింగ్ చేసుకున్న సమయంలో షో వేస్తామన్నారు. ప్రతి మంగళవారం సెలవని చెప్పారు. విజయవాడలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్న గాంధీ కొండ ప్లానిటోరియం వీక్షించి అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ప్రజలందరినీ ఆయన కోరారు.

వృద్ధులు, వ్యాధిగ్రస్థులతో ప్రేమగా ఉండండి

● సీబీడీటీ మాజీ చైర్మన్, సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కొసరాజు వీరయ్య

గోసాల (కంకిపాడు), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చారిటీ అంటే దానధర్మాలు చేయడమే కాదని, వృద్ధులను, వ్యాధిగ్రస్థులను ప్రేమగా, అప్యాయంగా పలకరించటమని సీబీడీటీ మాజీ చైర్మన్, సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కొసరాజు వీరయ్య అన్నారు. కోనేరు చారిటబుల్ ట్రస్టు సర్వసభ్య సమావేశం కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీరయ్య మాట్లాడుతూ మానవతావాది దివంగత వ్యాపార దిగ్గజం రతన్ టాటా తన సంస్థలో పనిచేసే 3500 మంది ఇంజినీర్లు వారానికో గంట సమయాన్ని వృద్ధులు, వ్యాధిగ్రస్థుల సేవకు కేటాయించే వారని తెలియజేయడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని తెలిపారు. అలాగే కోనేరు చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. ట్రస్టు సాయంతో వరద బాధిత



వీరయ్య, పున్నమ్మ దంపతులను సత్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

సహాయనిధికి రూ.3.50 లక్షలు, 62 మంది విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలకు రూ.6.35 లక్షలు అందించడం హర్షణీయమన్నారు. అనంతరం కొసరాజు వీరయ్య, పున్నమ్మ దంపతులను ఘనంగా సత్కరించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు డాక్టర్ సుధా, డాక్టర్ నాగేశ్వరరావు చదలవాడ, పాలడుగు లక్ష్మణరావు, ఆయుష్ ఆస్పటల్స్ సీఈవో డాక్టర్ యార్లగడ్డ రమేష్, కురుమద్దాలి మాజీ సర్పంచ్ కొసరాజు స్వప్న, రాంబాబు, వాసుదేవరావు, నార్ల మాలతి, మాజీ మేయర్ శ్రీధర్, కోనేరు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కె. నారేంద్రబాబు, కార్యదర్శి కె.భీమేశ్వరరావు, కోశాధికారి కె. శివాజీ పాల్గొన్నారు.

పాఠశాలల్లో నకిలీ అడ్మిషన్లపై చర్యలేవీ..?

● పార్లమెంటులో ఎంపీ వల్లభనేని బాలశౌరి

మచిలీపట్నం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నకిలీ అడ్మిషన్లు చూపుతూ సీబీఎస్ఈకి ముప్పును కలిగిస్తున్నవారిని గుర్తించారా, అలాంటి విద్యాసంస్థలపై తీసుకున్న చర్యలను వివరించాలని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి సోమవారం జరిగిన పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్నించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న విద్యాసంస్థల వివరాలు తెలియజేయాలని కోరారు. కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంతి చౌదరి సమాధానమిస్తూ సీబీఎస్ఈ నిబంధనలను కొన్ని పాఠశాలలు పాటించడంలేదన్నారు. రెగ్యులర్‌గా తరగతులకు హాజరుకాని విద్యార్థులను హాజరైనట్టు చూపుతున్నట్టు గుర్తించామన్నారు. పలు పాఠశాలలను ఆకస్మిక తనిఖీలు చేసి, నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఫారెక్స్ నిల్వలు బంగారు నిల్వలు మనదేశంలో ఎంతమేర ఉన్నయో వివరాలు తెలపాలని ఎంపీ బాలశౌరి కోరారు., కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి సమాధానమిస్తూ దేశంలో ఫారెక్స్ నిల్వలు 2024 సెప్టెంబరు 27 నాటికి 704.88 బిలియన్ యూఎస్ డాలర్లుగా ఉందన్నారు. చైనా, జపాన్, స్విజ్జర్లాండ్ తరువాత మనదేశం 4వ స్థానంలో ఉందన్నారు. రిజర్వుబ్యాంక్ వద్ద 854.73 టన్నుల బంగారు నిల్వలు ఉండగా, 2024 సెప్టెంబరు నాటికి దేశీయంగా 65.75 టన్నుల బంగారం నిల్వలున్నట్టు తెలిపారు.



ధర్నాచౌక్‌లో వినూత్న నిరసన తెలియజేస్తున్న నేతలు

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

● ధర్నాచౌక్‌లో ఏఐవైఎఫ్ వినూత్న నిరసన

ధర్నాచౌక్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను కొనసాగించి వారికి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి లంకా గోవిందరాజులు డిమాండ్ చేశారు. వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. చంద్రబాబు వలంటీర్ల జీవితాలను తలకిందులు చేశారన్న గోవిందరాజులు తాను కూడా తలకిందులుగా నిలబడి వినూత్నంగా నిరసన వ్యక్తం తెలిపారు. ఉగాది పండుగ రోజు శుభవార్త చెబుతానని నమ్మించి వలంటీర్ల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారిని మోసం చేశారని విమర్శించారు. వలంటీర్ల వ్యవస్థ లేదని అసెంబ్లీలో రాష్ట్ర మంత్రి డోల బాల వీరాంజేయ స్వామి ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలను ఈ విషయం తెలియదా? అని ప్రశ్నించారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని, రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వారిని కొనసాగించాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నగరాధ్యక్షుడు కంచర్ల భార్గవ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ లంకే సాయి, ఏపీ వలంటీర్ అసోసియేషన్ నేతలు జి.మమత, శిరీష, రాజకుమార్, రమేష్ పాల్గొన్నారు.

విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులకు ప్లాట్లు

కృష్ణలంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గన్నవరం విమానాశ్రయ విస్తరణకు భూములిచ్చిన రైతులకు సీఆర్‌డీఏ కమిషనర్ ఆదేశానుసారం రిటర్నబుల్ ప్లాట్లు అందచేసే నిమిత్తం విజయవాడలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో చేపట్టిన ఈ-లాటరీ కార్యక్రమం సోమవారం జరిగింది. 2016లో విమానాశ్రయ విస్తరణ నిమిత్తం 12.5315 ఎకరాల భూములిచ్చిన 20 మంది రైతులకు 24 రెసిడెన్సియల్ ప్లాట్లు, 15 కమర్షియల్ ప్లాట్లు మొత్తంగా 39 ప్లాట్లు అందచేశామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) బీఎల్ఎన్ రాజకుమారి తెలిపారు. రైతులకు ఇవ్వాల్సిన ప్లాట్లను రైతుల సమక్షంలో ఈ లాటరీ విధానంలో అందచేశామన్నారు.ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించామో వివరించడానికి ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బందిని, గ్రామ సర్వేయర్‌లను నియమించామన్నారు. ప్లాట్లు పొందిన రైతులకు సౌకర్యంగా వుండేందుకు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజులలోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రైతులు రిజిస్ట్రేషన్ క్రతువును పూర్తిచేసుకోవాలని రాజకుమారి సూచించారు. ఈ లాటరీ కార్యక్రమంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీఎల్ఎన్ రాజకుమారి, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రమణ్యం, గన్నవరం తహసీల్దార్ శివయ్య, మరో తహసీల్దార్ కె.అరుణాదేవి, ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరరావు, ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.లక్ష్మీప్రసన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రైతులకు ప్లాట్లను అందజేస్తున్న ప్రవీణ్‌చంద్

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ధర్నాచౌక్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ 108 సర్వీస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 108 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. 108 వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించడంతో పాటు ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. యూనియన్ నేతలు మాట్లాడుతూ జీవో 49 అమలును పునరుద్ధరించాలన్నారు. ఈ జీవోను రద్దు చేసి వైసీపీ ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర పని ఒత్తిడితో అనేక మంది ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వైద్యారోగ్య శాఖలోని అన్ని శాఖల్లో అమలు అవుతున్నట్టు 108 వ్యవస్థలోనూ రోజుకు మూడు షిఫ్టులల్లో షిఫ్టుకు 8 గంటల పని చొప్పున పని విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కిరణ్‌కుమార్, నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న లక్ష్మణరావు

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	108, 117, 128
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.595

టిడ్కో కాలనీలో బోరుకు భూమిపూజ

గుడివాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించటానికి కృషి చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. బొమ్ములూరు పంచాయతీ పరిధిలోని టిడ్కో కాలనీ వద్ద బోరు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. మండల పార్టీ అధ్యక్షులు వాసే మురళీ మాట్లాడుతూ రక్షిత తాగునీరు, రహదారుల అభివృద్ధి, మెరుగైన విద్య, వైద్యం అందించటానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యదర్శి కొడాలి రామ్మోహనరావు, కండవల్లి సత్యనారాయణ, కండవల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



అమ్మో.. అండర్‌పాస్!

- చెరువును తలపించేలా నీరు
- ప్రమాదకరంగా గోతులు
- అండర్‌పాస్ దుస్థితి అధికారులకు వివరించిన ఎమ్మెల్యే కుమార్ రాజా
- నెలలు గడుస్తున్నా చర్యలు శూన్యం



విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిలో తాడంకి వద్ద అండర్‌పాస్‌లో నీరు

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల)

విజయవాడ-మచిలీపట్నం జాతీయరహదారిలో తాడంకి సమీపాన అండర్ పాస్‌లో మోకాలు లోతు నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఉయ్యూరు, మంటాడ, పమిడిముక్కల మండలంలోని పలు గ్రామాల వచ్చే వాహనాలు తాడంకి వద్ద అండర్ పాస్‌లో నుంచి జాతీయ రహదారికి వెళ్లాల్సి ఉంది. గోపువానిపాలెం, మర్రివాడ, సాయిపురం, జబర్లపూడితో పాటు పామర్రు మండలం యలమర్రు, పెదపారుపూడి, చినపారుపూడి గ్రామాలకు కూడా ఇదే రహదారి కావడంతో ఆయా గ్రామాలవారు ప్రతిరోజు ద్విచ క్ర వాహనాలు, ఆటోలపై రాకపోకలు సాగిస్తుంటారు. అండర్‌పాస్‌లో ఎల్లప్పుడూ నీరునిలిచి ప్రమాదాలకు నిలయంగా మారింది. మచిలీపట్నం, అవగనిగడ్డ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు సైతం జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లో కనుమూరు సమీపం వరకు వెళ్లడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి.

ఎమ్మెల్యే సూచనలు పట్టించుకోని హైవే అధికారులు

అండర్ పాస్‌లో సవంవత్సరం పొడవునా నీరు నిలిచి పలు గ్రామాల ప్రజలకు అసౌకర్యం కలగడంతో పాటు ప్రమాదాలకు గురవుతున్న వైనాన్ని పామర్రు ఎమ్మె ల్యే వర్ల కుమార్‌జా జాతీయ రహదారి అధికారుల దృష్టికి వెళ్లడమే కాక ఉన్నతాధికారిని అండర్‌పాస్ వద్దకు తీసుకువచ్చి పరిస్థితిని చూపించి చర్యలు తీసుకోవాలని సూచి ంచారు. అధికారి వచ్చి చూసి దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఎక్కడి వేసి గొంగళి అక్కడే చందాన చర్యలు తీసుకోలేదని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకోరా ?



అండర్ పాస్‌లో సంవత్సరం పొడవునా నీరు నిలిచి ఉండటం వల్ల ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నేషనల్ హైవే అధికారులు వచ్చారు..వెళ్లారు.. అన్నట్టుగా ఉంది. చర్యలు శూన్యం.

-షేక్ జాన్‌బాషా, సాయిపురం సర్పంచ్

రాంగ్‌రూట్‌లో వెళ్లాల్సి వస్తోంది



తాడంకి వద్ద అండర్‌పాస్‌లో ఎల్లప్పుడు నీరు నిలవడంతో దిచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వెళ్లే వీలు లేక హైవేపై రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. హైవేపై తక్కువ ఎత్తులో ఫ్లైఓవర్, సర్వీసు రోడ్లకన్నా పల్లంగా అండర్ పాస్ నిర్మించారు. దీంతో పెద్దవాహనాలు వెళ్లే వీలు లేక ప్రజలు ఇబ్బంది ప డుతున్నారు. అధ్వానంగా ఉన్న అండర్‌పాస్‌ను ఎమ్మెల్యే హైవే అధికారులకు చూపించినా ఫలితం లేకుండా పోయింది.

- వై.రాజేంద్రప్రసాద్, మర్రివాడ



రావిని సత్కరిస్తున్న పట్టణ కళాకారుల సంఘం

వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకలు

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు

గుడివాడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : కులమతాలకు అతీతంగా నిర్వహించుకునే పండుగ వనసమారాధన అని, పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు.ఎన్‌జీవోస్ హోంలో పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ప్రముఖ రచయిత జాషువ మనుమడు డాక్టర్ సుశీల్‌కుమార్, భారతీ ఆలపించిన గేయాలు సభికులకు కట్టిపడేసాయి. తణుకుకు చెందిన సాయి వినూత్న భరత నాట్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన రావి వెంకటేశ్వరరావు, ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షునిగా ఎన్నికైన యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు జగన్మోహనరావులను కళాకారుల సంఘం ఘనంగా సత్కరించింది. సంఘం గౌరవాధ్యక్షులు నెరుసు చింతయ్య, సలహాదారుడు స్వామిదాసు, అధ్యక్ష, కార్యదర్శులు కొడాలి రాజా, గాజులపల్లి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వార్డుల్లో పర్యటన

మీ కోసం- మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో పారిశుధ్య, తాగునీటి సమస్యలు తెలుసుకుని అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. పట్టణాభివృద్ధికి తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు.

హనుమంతపురం మాజీ సర్పంచ్ పరుచూరి మృతి



పరుచూరి వెంకటేశ్వరరావు

పమిడిముక్కల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు, హనుమంతపురం మాజీ సర్పంచ్ పరుచూరి వెంకటేశ్వరరావు ఆదివారం రాత్రి మృతిచెందారు. వెంకటేశ్వరరావుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మాజీ వైస్ ఎంపీపీ లింగంనేని బాబూరావు, మాజీ ఎంపిపీ మోటూరు వెంకట సుబ్బయ్య, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ సర్పంచ్ , మండలపార్టీ మాజీ అధ్యక్షుడు దొప్పలపూడి శంకరరావు పార్టీ నాయకులు రాజులపాటి రామాంజనేయులు, మల్లిఖార్జునరావు వెంకటేశ్వరరావు భౌతికకాయా న్ని సందర్శించి నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు అంత్యక్రియలు బుధవారం హనుమంతపురంలో నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు నేడు

గుడివాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ ఐసీడీఎస్ ఎరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 26వ తేదీన ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని సీడీపీవో కె.విజయ ఫ్లోరెన్స్ తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9 గంటలకే ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని కోరారు. గుడివాడ అర్బన్‌లో కార్యకర్త పోస్టుకు, హెల్పర్లు తొమ్మిది పోస్టులకు, గుడివాడ రూరల్‌లో హెల్పర్ పోస్టు ఒకటి, నందివాడ మండలంలో కార్యకర్తల పోస్టులు రెండు, హెల్పర్ల పోస్టులు నాలుగు, గుడ్లవల్లేరు మండలంలో హెల్పర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు.



ఆకట్టుకుంటున్న క్రిస్మస్ స్టార్

పెదపారుపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సుందరంగా తీర్చిదిద్దారు. యలమర్రు, వెంట్రప్రగడ, భూషణగుళ్ల, పెదపారుపూడి రక్షణ దేవాలయంలో మేజర్ విజయ్ కుమార్ క్రిస్మస్ స్టార్‌ను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ పెద్దలు దగాని జోసెఫ్, నత్తా భూషణకుమార్, పాటి భాస్కరరావు, గృహసంతి సభ్యులు పీక పద్మ, గుమ్మడి ఏసు, దగాని గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

గురజాడ రచనలు సమాజహితానికి దోహదం

గుడివాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమ సమాజహితానికి గురజాడ అప్పారావు చేసిన రచనలు నేటికీ ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తున్నాయని ప్రముఖ ప్రవచనకర్త వలివేటి వెంకటశివరామకృష్ణమూర్తి అన్నారు. ఆంజనేయపేటలోని కామ్రేడ్ సుందరయ్య భవన్‌లో భారతీ సమితి ఆధ్వర్యంలో గురజాడ కవితా వైభవంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శివరామకృష్ణమూర్తి గురజాడ రచనలపై వివరణాత్మక, విశ్లేషాత్మక ప్రసంగం చేశారు. గురజాడ రచనలు కన్యాశుల్కం, పుత్తడిబొమ్మ-పూర్ణమ్మలలోని పలు అంశాలను వివరించారు. భారతీసమితి అధ్యక్షకార్యదర్శులు ప్రసాద్, మాధవరావు, సమితి కార్యవర్గ సభ్యులు, పలువురు సాహితివేత్తలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కంకిపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భావితరాల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని కంకిపాడు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. కంకిపాడు రంగా సర్కిల్ వద్ద తుమ్మల ఆంజనేయులు కుమారులు తుమ్మల సాయి, వెంకట మనోజ్‌లు అందించిన మొక్కలను ఆమె నాటారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, కొప్పరాజు సురేష్, టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, ప్రముఖ వైద్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ, స్థానిక టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పులి శ్రీనివాసరావు, గోగినేని వెంకట రమణ, చలవాది రాజా, కొండా నాగేశ్వరరావు, బొప్పూడి శివరామకృష్ణ, సుంకర శివ, బోయిన నాగరాజు, కోలవెన్ను విజయ్ పాల్గొన్నారు.



గుడివాడ భీమేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు





కూచిపూడి బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో దీపాలంకరణ.. మేడూరులో..

మార్మోగిన శివనామస్మరణ

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

గుడివాడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : చివరి కార్తీక సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడియి. ఆలయాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. భీమేశ్వరస్వామి దేవస్థానం, గౌరీశంకర స్వామి దేవస్థానం, ఆనందేశ్వరస్వామి దేవస్థానం, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు తెలిపారు.

బాలాత్రిపుర సుందరిదేవి ఆలయంలో

కూచిపూడి : కార్తీక మాసం ఆఖరి (నాల్గవ) సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కూచిపూడి గంగాబాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో వేకువజాము నాలుగు గంటల నుంచి భక్తులు దర్శించుకున్నారు. అలాగే దేవాలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెదపూడి, యద్దనపూడి, అయ్యంకి, చినముత్తేవి, నిడుమోలు, కాజ, కోసూరు, మొవ్వపాలెం, మొవ్వ, గూడపాడు శివాలయాలలో విశేష పూజలు జరిగాయి.

పెదపారుపూడి : కార్తీకమాసంలో ఆఖరి సోమవారం కావటంతో మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఉదయాన్నే కాల్వ దగ్గర స్నానాలు చేసి దేవాలయానికి వెళ్లి దీపాలు వెలిగించి పరమశివుడికి పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

నాగేశ్వరస్వామికి పూజలు

పమిడిముక్కల : కార్తీక మాస సోమవారం పురస్కరించుకుని మేడూరు నాగేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిళ్వార్చన, ప్రత్యేకపూజలు చేశారు. వేకువజాము నుండి భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణంలో దీపారాధన, పూజలు చేశారు.

డోకిపర్రులో గంగానమ్మ ఆలయ శిఖర ప్రతిష్ఠ



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాము, రావి

గుడ్లవల్లేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రు గంగానమ్మ ఆలయ శిఖర ప్రతిష్ఠ, రామాలయ మండపానికి శంకుస్థాపన, పుట్టలమ్మ ఆలయ మండప ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. రాము మాట్లాడుతూ గ్రామస్తుల కోరికలను యువ నాయకుడు వెల్లంకి ఉమా శంకర్ నెరవేర్చడం అభినందనీయమన్నారు. మూ డు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, వెల్లంకి ఉమాశంకర్, వీరమాచనేని శివప్రసాద్, వీరమాచనేని నాగజయరామ్, నాగమోహన్, ప్రముఖ సినీ దర్శకులు అన్నే మోహన్ గాంధీ, వీరమాచనేని రత్నాకరరావు, పాండురంగారావు, సుబ్బారెడ్డి, జాని, శివాజీ రెడ్డి, శ్రీమన్నారాయణ, ఎ.రామ్మోహనరావు, బొప్పన శివప్రసాద్, పెన్నేరు రమేష్, అల్లూరి వాసు పాల్గొన్నారు.

గుమ్మడి గోపాలకృష్ణకు జనసేన సత్కారం



పమిడిముక్కల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి ఛైర్మన్‌గా నియమితుడైన గుమ్మడి గోపాలకృష్ణను ఆయన స్వగ్రామం మేడూరులో జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ సీనియర్ నాయకుడు నరాలశెట్టి వెంకట్ విజయ్, కూటమి నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. నాటకపరిషత్ ఛైర్మన్‌గా మరోసారి నియమితులవ్వడం సంతోషకరమన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష

గుడివాడ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సం క్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉం దని ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం జరిగింది. అధికారులు సమావేశాలకు తప్పని సరిగా వచ్చి, పూర్తి సమాచారాన్ని అందించాలన్నారు. డీఎల్‌డీవో సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ విస్తరణాధికారిణి వి.అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

ఉంగుటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు దత్తత కుమార్తె త్రివేణి (18)ఆదివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఉంగుటూరు ఎస్సై యు.గోవిందు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలుకపాడు గ్రామానికి చెందిన అజ్మీర వెంకటేశ్వరరావు, గోపి అన్నదమ్ములు, గోపి కుమార్తెను వెంకటేశ్వరరావు దత్తత తీసుకున్నాడు. బీఎస్సీ డిగ్రీ ప్రైవేటుగా ప్రిపరేషన్ అవుతోంది. ఈ నేపథ్యంలో పొలంలో చల్లిన విషపుమందు ఆహారపదార్థాలపై పడటంతో ఆ ఆహారాన్ని ఈ నెల 19న పొరపాటున భుజించింది. వాంతులు కావడంతో గన్నవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్సకోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ 24 వతేదీ ఆదివారం రాత్రి మృతి చెందింది.

కొత్త ఓటర్లు ఓటును నమోదు చేసుకోవాలి

గుడివాడ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : కొత్త ఓటర్లు తమ ఓటును విధిగా నమోదు చేసుకోవాలని, ఓటు విలువను తెలుసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు అన్నారు. వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ప్రసాదరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించారు. పట్టణంలోని పలు చోట్ల పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు సోమవారం అసిస్టెంట్ కమీషనర్ పి.శ్రీనివాసరావుతో కలిసి పర్యవేక్షించారు. తుమ్మల రాంబ్రహ్మం మున్సిపల్ పార్కులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో క్షేత్రయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



కూచిపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థిని జోగి లక్ష్మీధన్యశ్రీ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతాకాన్ని సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రావు తెలిపారు. అలసలేటి భాను తేజశ్రీ పాల్గొని రెండో స్థానంలో నెగ్గి రజిత పతాకాన్ని పొందినట్లు తెలిపారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు వారిని అభినందించారు. వృత్తి విద్యాకోర్సు అధ్యాపకులు ఆనంద్, గ్రంథాలయ పాలకులు సర్వారెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్న సమారాధన

ఉయ్యూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట అయ్యప్పస్వామి ఆలయంవద్ద అయ్యప్ప భక్తులకు సోమవారం అన్న సమారాధన ప్రారంభించారు. ప్రతియేటా అయ్యప్పదీక్ష పరులకు ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో 40 రోజులపాటు అన్నసమారాధన చేయడం పరిపాటిగా వస్తుంది. పాలడుగు చంద్రశేఖర్, రామకృష్ణ సహకారంతో జరిగిన అన్న సమారాధనలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	108, 117, 128
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.595

బందరుకోటలో ఆలయ రాజగోపురం పనులు ప్రారంభం



మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బందరుకోటలోని కోదండ రామస్వామి ఆలయం రాజగోపుర నిర్మాణ పనులకు మంత్రి కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనాలతో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న మహిళా పోలీసులు

బీఎల్వో విధుల కేటాయింపుపై అభ్యంతరం

మహిళా పోలీసులు, సచివాలయ అసిస్టెంట్లు వేర్వేరుగా వినతిపత్రాలు

చల్లపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బీఎల్వోల విధులు తమకు కేటాయించవద్దంటూ సచివాలయ మహిళా పోలీసులు, సచివాలయాల అసిస్టెంట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీలతకు సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్వో) డ్యూటీలు నిర్వహించిన వీఆర్వోలను పక్కనపెట్టి వారి స్థానంలో మహిళా పోలీసులకు బీఎల్వో డ్యూటీలు కేటాయించటంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ చల్లపల్లి మండల మహిళా పోలీసులు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.శ్రీలతకు వినతిపత్రం సమర్పించారు. ఇసుక క్వారీల వద్ద మహిళా పోలీసులకు వేసిన కాపలా డ్యూటీలను సైతం రద్దుచేయాలని కోరారు. పనిఒత్తిడిలో ఉన్న తమను బీఎల్వో విధుల నుంచి తప్పించాలంటూ సచివాలయ డిజిటల్, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీలతకు వినతిపత్రం అందజేశారు.



డాక్టర్ శ్రీనివాసాచార్యకు ఆర్‌ఎంపీల సత్కారం

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఐఎంఏ రాష్ట్ర ఛైర్మన్‌గా ఎన్నికైన బృందావనం శ్రీనివాసాచార్యను సోమవారం ఆర్‌ఎంపీ అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యులందరూ అంకితభావంతో వైద్య సేవలందించాలని శ్రీనివాసాచార్య కోరారు. నందూరి శంకరరావు, ఎస్. ఉదయబాస్కర రాజు, కె. వెంకటేశ్వరరావు, అగ్నిహోత్రం ఫణిగోపాల్, జి. నాగ చంద్రశేఖర్, ఏ. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు భవిజ్ఞ



ఘంటసాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొగినేనిపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని కొడాలి భవిజ్ఞ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు తెలిపారు. అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని భవిజ్ఞ అత్యంత ప్రతిభ కనబర్చిందన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కొడాలి భవిజ్ఞను, పీడీ గరికపాటి మారుతిని హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు గొర్రెపాటి శ్రేష్ఠ



ఘంటసాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాల గ్రామానికి చెందిన గొర్రెపాటి శ్రేష్ఠ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఏడో ఎస్క్యూఏవై (కరాటే) చాంపియన్ షిప్ సబ్ జూనియర్ పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుని గోల్‌మెడల్, ప్రశంసాపత్రాన్ని సాధించింది. ఘంటసాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ అధ్యక్షుడు సురేష్ కుమార్తె చిన్నారి శ్రేష్ఠను పలువురు అభినందించారు.

ఆంజనేయస్వామికి లక్ష ఫలాల అర్చన

అవనిగడ్డ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ సువర్చలా సమేత ఆంజనేయస్వామికి సోమవారం లక్ష ఫలార్చన, పుష్పార్చనలు వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితుడు బృందావనం నరసింహమూర్తి (ఇబ్రహీంపట్నం) ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, శాంతిహోమం, సుదర్శన హోమం, వాస్తు హోమాలు జరిపారు. అర్చక స్వాములు బృందావనం వేణుగోపాలచార్యులు, అనంత రామాచార్యులు, భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేయగా, వందలాదిగా అన్నసమారాధనలో పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రదానం

నాగాయలంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దాతల ఆర్థిక సౌజన్యంతో నిత్యాన్నదానం కార్యక్రమాలు నిరాటంకంగా జరుగుతున్నాయి. కార్తీక మాసంలో అన్నదానాలు చేసిన పలువురు దాతల నగదు సహాయంతో సోమవారం అన్నదానంతో పాటు 40 మంది వృద్ధులకు వస్త్రదానం చేశారు. పొన్నంపల్లి చిన్న, మత్తి శేషుబాబు, బాబురావు తదితరులు పర్యవేక్షించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు అన్నారు. కోడూరు తొమ్మిదో వార్డులో రూ.6.20 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి కూటమి నేతలతో కలసి శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు, ఎంపీటీసీ సభ్యుడు తిమ్మన నాంచారయ్య, వార్డుసభ్యులు దామెర్ల నారాయణ, ఉల్లి శేషగిరిరావు, బచ్చు వెంకటేష్, పాశం పాండురంగారావు, చింతల రమేష్, బండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముద్దినేనికి విక్కుర్తి శ్రీనివాస్ పరామర్శ

కోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మాతృవియోగానికి గురైన కోడూరు శివారు కృష్ణాపురం గ్రామానికి చెందిన కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, ఆయన సోదరులను ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విక్కుర్తి రాంబాబు, పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీను, రేపల్లె ఈశ్వరరావు, రేపల్లె ప్రతాప్, బొప్పన రమణ,కోడూరు మాజీ ఎంపీపీ పెద్ది భాస్కరరావు, బడే వీరబాబు, నాగం పాపయ్య, రాజు ఉన్నారు.



రామలింగేశ్వర స్వామి సేవలో మంత్రి కొల్లు రవీంద్ర



ఉల్లిపాలెం శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో పెద్ద సంఖ్యలో దీపారాధనలు చేస్తున్న మహిళలు



నాగాయలంకలో శ్రీరామపాద క్షేత్రంలో..

శివార్చనలు.. కార్తీక దీపశోభ

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మచిలీపట్నంలోని వివిధ శివా లయాల్లో మహిళలు దీపారాధనలు చేశారు. బచ్చుపేట మల్లేశ్వర స్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వర స్వామి, రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వర స్వామి, ఈడేపల్లి ముత్యాలమ్మ తల్లి, నిజాంపేట వేణుగోపాల స్వామి ఆలయాల్లో మహిళలు దీపారాధనలు చేశారు. ఆకాశదీపాలు వెలిగించారు. రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన అభిషేకాలు, అర్చనల్లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. మారేడు దళాలతో అర్చనలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రెడ్డి పాల్గొన్నారు.

పెడన రూరల్ : శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉరివి పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నూరు, ఉప్పల కలవగుంట, లంకలకలవగుంట, చోడవరం, నందిగామ, కూడూరు, నడుపూరు, కొంకేపూడి, బల్లిపర్రు, నడుపూరు అగ్రహారం శివాలయాలలో భక్తులు సహస్ర దీపాలంకరణ చేశారు.

శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో



కార్తీకదీపోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, రామానుజ జీయర్ స్వామి

కోడూరు : ఉల్లిపాలెం గ్రామంల రాజ్యలక్ష్మి గోదాదేవి సమేత శ్రీమన్నారాయణ స్వామి ఆలయం వద్ద కార్తీక దీపోత్సవం అష్టాక్షరి సంపత్ కుమార్ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో శోభాయమానంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. విష్ణు, శంకు చక్ర ఆకృతిలో ప్రమీదల్లో దీపాలను వెలిగించారు. పల్లకీ ఉత్సవంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. మండలి వెంకట్రామ్, మర్రే గంగయ్య, కోట రాంబాబు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, బొలిశెట్టి విటల్‌రావు, గుడిసేవ సూర్యనారాయణ, గ్రామసర్పంచ్ వెర్రి పావని, కాగిత రామారావు పాల్గొన్నారు.

చల్లపల్లిలో..

చల్లపల్లి : నడకుదురు పృధ్వీశ్వరక్షేత్రం, చల్లపల్లి అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, లక్ష్మీపురం దుర్గాపార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయం, పాగోలు రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక దీపోత్సవ శోభ వెల్లివిరిసింది. రామానగరం క్లబ్ రోడ్‌లోని రామాలయ ఆవరణలో ప్రత్యేక దీపారాధనలు చేశారు.

శ్రీరామపాద క్షేత్రంలో..

నాగాయలంక : శ్రీరామపాదక్షేత్రం పుష్కర ఘాట్‌లో కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. కార్తీక దీపాలను వెలిగించి నదిలోకి వదిలారు. శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, సభ్యులు ఉప్పల బుజ్జి, బోయపాటి రాము పర్యవేక్షించారు.

కృత్తివెన్నులో..

కృత్తివెన్ను : కార్తీక మాసం చివరి సోమవారం కావటంతో ఆలయాలన్నీ భక్తులతో పోటెత్తాయి. కృత్తివెన్ను దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. లక్ష బిల్వార్చన, రుద్రాభిషేకం, లక్ష రుద్రార్చన, ఆకాశ దీపం, జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. సంగమూడి, కృత్తివెన్ను, గుడిదిబ్బ గ్రామాల్లో కార్తీక దీపాలు వెలిగించి, అన్నసమారాధనలు నిర్వహించారు.

లక్ష బిల్వార్చన

అవనిగడ్డ రూరల్ : వేకనూరు గంగా పార్వతీ సమేత ఉభయ ముక్తేశ్వరాలయంలో కార్తీక మాసం ఉత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష బిల్వార్చన చేశారు. ప్రధాన అర్చకులు ఘంటసాల వెంకటేశ్వర శాస్త్రి బ్రహ్మత్వంలో తాడిగడప వెంకటేశ్వర ప్రసాద్ నేతృత్వంలో పది మంది రుత్వికులు ఉభయ ముక్తేశ్వరస్వామికి పంచామృత, గోక్షీరాభిషేకాలు చేశారు. రుద్రాభిషేకాలు, బిల్వార్చన చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

అవనిగడ్డ రూరల్ : వేకనూరు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితులు పాకలపాటి రామచంద్రరావు బ్రహ్మత్వంలో కల్యాణాన్ని దంపతులు నిర్వహించారు.

శివాలయానికి రూ.51,116 విరాళం



కోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కోడూరులో పునర్నిర్మాణం చేస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి (శివాలయానికి) గ్రామానికి చెందిన బడే కృష్ణమోహన్‌రావు కుటుంబసభ్యులు రూ.51,116 విరాళాన్ని అందజేశారు. శివరామకృష్ణ క్షేత్ర కమిటీ నేతలు కృష్ణమోహన్ ఇంటి వద్దకు వెళ్లి విరాళాన్ని అందుకున్నారు. కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బడే భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం

పెడన, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా వచ్చిన అధికారులు తనను కలకవపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంపై సోమవారం మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రాజులపాటి వాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారి విధులకు హాజరవుతున్నారో లేదో తెలియడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు, సబ్సిడీ అపరాల విత్తనా లపై మాట్లాడదామంటే వ్యవసాయాధికారి సమావేశానికి గైర్హాజరయ్యారని సభ్యులు మండిపడ్డారు. ఏవో పూర్తి వివరాలతో వచ్చి తనను కలవాలని ఎంపీడీవో జయరామ్‌కు ఆమె సూచించారు. గృహ నిర్మాణ శాఖపై జరిగిన చర్చలో ఉప్పలకలవగుంట సర్పంచ్ గుడిసేవ శ్రీనివాసరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో నాలుగు లక్షల రూపాయలు ఇస్తారన్న ఆశతో లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవడం మానేశారన్నారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్ మాట్లాడుతూ, నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని తమ ప్రభుత్వం చెప్ప లేదన్నారు. పెనుమల్లి సర్పంచ్ గరికపాటి రామానాయుడు మాట్లాడుతూ, రైతులు ధాన్యం తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల సమాచారం, మద్దతు ధరపై విస్తృత ప్రచారం చేయాలని తహసీల్దార్ అనిల్ కుమార్‌కు ఆయన సూచించారు. ఇరిగేషన్, విద్యుత్, పశుసంవర్థక, ఐసీడీఎస్ ఇతర శాఖలపై సమీక్ష నిర్వహించారు. వైస్ ఎంపీపీలు యాదంరెడ్డి వరప్రసాదరావు, పరసా వాకలమ్మ, ప్రత్యేక ఆహ్వానితుడు రాజులపాటి అచ్యుతరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

మచిలీపట్నం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కాకినాడలో జరిగిన జోనల్ స్థాయి పోటీల్లో కృష్ణాజిల్లా విద్యార్థులు ప్రతిభను చాటారు. దేశభక్తి గేయాల పోటీల్లో మచిలీపట్నం మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి డి.గణేష్ ప్రథమ బహుమతి సాధించాడు. బల్లిపర్రు సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిని సిహెచ్. అజిత ద్వితీయ బహుమతి, వ్యాసరచన పోటీల్లో పులిగడ్డ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి కె.మనోజ్ మొదటి, పామర్రు ఏఎన్‌ఎం ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థి ప్రథమ స్థానం సాధించారు. వక్తృత్వంలో జవ్వారుపేట వెంకటేశ్వర ఇంగ్లీషు మీడియం విద్యార్థిని బి. స్నేహధరణి, లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.దివ్యశ్రీ, కె. అర్చన తృతీయ స్థానంలో నిలిచారు. వంద మీటర్ల పరుగుపందెంలో మచిలీపట్నం మైనారిటీ ఏపి రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి గణేష్ మొదటి బహుమతి సాధించాడు. విజేతలను డీఈవో రామారావు, సైన్స్ అధికారి మహమ్మద్ జాకీర్ అహమ్మద్ అభినందించారు.

29 మందికి సీఎం సహాయ నిధి చెక్కులు



సీఎం సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి రూ.21 లక్షల సహాయం అందజేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలో 59 మంది లబ్ధిదారు లకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.42 లక్షల ఆర్థిక సహాయం అందజేసినట్లు వివరించారు. మొదటి విడతలో 15 మందికి రూ.6,48,069, రెండవ విడతలో 15 మందికి రూ.14,57,012లు, మూడో విడతలో తాజాగా 29 మందికి రూ.21,01,297 ఆర్థిక సహాయం మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఘంటసాల మండలంలో ఏడుగురికి సీఎం సాయం

ఘంటసాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలానికి చెందిన ఏడుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అవనిగడ్డలో అందజేశారు. మత్తి సుబ్బారావుకు రూ.2,70,876, గరికపాటి కృష్ణకుమారికి రూ.15 వేలు, తాడంకి బాబురావుకు రూ.30,786, గూడవల్లి బేబీ సరోజినికి రూ.56,324, కె.వీరకుమారికి రూ.81,262, కనకమేడల సర్వోత్తమరావుకు రూ.70,101, చిట్టూరి గోపిచంద్‌కు రూ.21,974 అందజేశారు. మండలి వెంకట్రామ్, తెలుగుయువ రాష్ట్ర నాయకులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), పాపవినాశనం టిడిపి నేత కుంపటి చిట్టిబాబు, శ్రీకాకుళం ఉపసర్పంచ్ శీలం శ్రీనివాస్, కొండవీటి పవన్ కుమార్, మత్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మినుము యాజమాన్యంపై శిక్షణ

మోపిదేవి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రెండో పంటగా సాగు చేసే మినుము యాజమాన్యంపై కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి రైతులకు అవగాహన కల్పించారు. రావివారిపాలెం గ్రంథాలయం వద్ద ఆమె మాట్లాడుతూ మినుము పంటను తెల్లదోమ, తేనెబంక, తామర పురుగు రక్షించుకోవాలన్నారు. సమగ్ర యాజమాన్య చర్యలు చేపట్టాల్సిందిగా రైతులకు తెలిపారు. మినుములో కాండం గజ్జి ఆశించి మొక్కలు చనిపోతున్నాయని, ట్రైకోడెర్మా విరిడి వంటి జీవ సిలీంద్ర నాశిని కిలో విత్తనానికి 10 గ్రాముల చొప్పున కలుపుకుని విత్తనశుద్ధి చేయాలన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ ముఖమండపం ప్రారంభం

నాగాయలంక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : టి.కొత్తపాలెం మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మెండు శివరామప్రసాద్ - నాగేశ్వరి విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో కోటి రూపాయల వ్యయంతో పునర్నిర్మించిన ముఖమండపాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి వెంకటేశ్వరరావుతోపాటు కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. మల్లేశ్వరస్వామిని పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ కుటుంబసభ్యులతో సోమవారం దర్శించుకుని పూజలు చేశారు. వారిని గ్రామస్థులు సత్కరించారు. పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీను, బొప్పన రమణ, రేపల్లె ఈశ్వర్‌రావు, మునలయ్య, బలరాం, గోపి, రవీంద్ర, రాంజీ, బాలభాస్కర్ తదితరులు దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన 29న

మోపిదేవి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఈ నెల 29వ తేదీన లక్ష బిల్వార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఉదయం గోపూజ, విఘ్నేశ్వరపూజ, మహాన్యాస పారాయణ, రుద్రాభిషేకం, చందనాభిషేకం జరుగుతాయి. మధ్యాహ్నం లక్ష బిల్వార్చన, రుద్ర హోమం నిర్వహిస్తారని తెలిపారు.

హంసలదీవిలో సముద్ర స్నానాలు

కోడూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవిలో భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి సముద్రస్నానాలాచరించారు. మెరైన్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తీరం వెంబడి గస్తీ నిర్వహించారు.